మంగళవారం
19-03-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 267
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
# విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

## అఫ్గాన్‌పై పాక్ వైమానిక దాడులు: 8 మంది మృతి

కాబూల్: అఫ్గానిస్థాన్‌పై అర్ధరాత్రి పాకిస్థాన్ సైన్యం వైమానిక దాడులకు పాల్పడింది. అఫ్గాన్‌లోని పక్తికా ప్రావిన్స్‌లోగల బర్మాల్ జిల్లాలో, ఖోస్ట్ ప్రావిన్స్‌లోగల సెపెరా జిల్లాలోని అఫ్గాన్ దుబాయ్ ఏరియాలో ఈ వైమానిక దాడులు జరిగాయి. సాధారణ పౌర నివాసాలే లక్ష్యంగా పాకిస్థాన్ ఈ వైమానిక దాడులకు పాల్పడింది. తాలిబన్ల పాలనలో ఉన్న అఫ్గానిస్థాన్ అధికార ప్రతినిధి జబివుల్లా ముజాహిద్ ఈ విషయాన్ని వెల్లడించారు. పాకిస్థాన్ వైమానిక దాడుల్లో పక్తికా ప్రావిన్స్‌లోని ఆరుగురు మృతిచెందగా... వారిలో ముగ్గురు చిన్నారులు, ముగ్గురు మహిళలు ఉన్నారని ముజాహిద్ తెలిపారు. ఖోస్ట్ ప్రావిన్స్‌లో జరిగిన దాడుల్లో కుప్పకూలిన భవన శిథిలాల కింద చిక్కుకుని మరో ఇద్దరు మహిళలు మరణించారని చెప్పారు.

# ఎన్నికల బాండ్ల నంబర్లూ చెప్పాల్సిందే

### 23 వరకు ఎస్‌బీఐకి సుప్రీం తుదిగడువు

న్యూఢిల్లీ: ఎన్నికల బాండ్ల వ్యవహారంలో భారతీయ స్టేట్ బ్యాంక్‌పై సుప్రీంకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ ఆదేశాల ప్రకారం బాండ్ల నంబర్లను కేంద్ర ఎన్నికల సంఘానికి ఇవ్వకపోవడంపై బ్యాంకును నిలదీసింది. నంబర్లతో సహా అన్ని వివరాలు ఈసీకి ఇచ్చి...మార్చి 21లోగా తమకు అఫిడవిట్ సమర్పించాలని ఎస్‌బీఐని ఆదేశించింది. బాండ్ల విషయంలో ఎస్‌బీఐ పక్షపాతంగా ఉండకూడదని, ఎంపిక చేసిన అంశాలనే సమర్పించాలనుకోవడం సరికాదని స్పష్టంచేసింది. దీనికి సంబంధించిన ప్రతి సమాచారం బయటకు రావాల్సిందేనని తేల్చిచెప్పింది. ఏ విషయాన్ని అణచివేయకూడదనే ఉద్దేశంతోనే అన్ని వివరాలు ఇవ్వాలని తాము తీర్పు చెప్పామని పేర్కొంది. ఏ దాత ఏ పార్టీకి ఎంత ఇచ్చారనే విషయాన్ని తెలియజేసే యునిక్ నంబర్లతో పాటు అన్ని వివరాలు ఈసీకి ఎస్‌బీఐ ఇవ్వాల్సిందేనని, ఇందులో ఎలాంటి సందేహాలకు

- మిగతా 2 లో

# ఈసీ కొరడా...

- బెంగాల్ డీజీపీ సహా ఆరు రాష్ట్రాల్లో హోం శాఖ కార్యదర్శులపై వేటు
- మున్సిపల్ కమిషనర్లు... అదనపు, డిప్యూటీ కమిషనర్ల బదిలీకి ఆదేశం

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈసీ కొరడా ఝళిపించింది. ఎన్నికలను మెరుగ్గా నిర్వహించేందుకు, సమగ్రతను నిర్ధారించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం గుజరాత్, ఉత్తర ప్రదేశ్, బీహార్, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లకు చెందిన హోం శాఖ కార్యదర్శులను తొలగించాలని ఆదేశించింది. అలాగే పశ్చిమ బెంగాల్ పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ) ని, మిజోరం, హిమాచల్ ప్రదేశ్ సాధారణ పరిపాలనా విభాగాల కార్యదర్శిని కూడా తొలగించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆ వర్గాలు తెలిపాయి. ఏప్రిల్ 19 నుంచి ఏడు దశల్లో జరగనున్న లోక్‌సభ, ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు, 13 రాష్ట్రాల్లోని 26 స్థానాల్లో ఉప ఎన్నికలకు ముందు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, కొత్తగా నియమితులైన డిప్యూటీ కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధు సోమవారం ఇక్కడ సమావేశం నిర్వహించిన తర్వాత ఈ చర్య వచ్చింది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన కొద్ది రోజులకే సీఈసీ రాజీవ్ కుమార్ నేతృత్వంలోని ఎన్నికల సంఘం బృహన్‌ముంబై మునిసిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) కమిషనర్ ఇక్బాల్ సింగ్ చాహల్, అదనపు కమిషనర్లు,

- మిగతా 2 లో

# అసంతృప్తుల దారెటు?

- రోజురోజుకూ సన్నగిల్లుతున్న అవకాశాలు
- అన్నిస్థానాలకు వైసీపీ అభ్యర్థుల ఖరారుతో ఆశలు ఆవిరి
- టీడీపీలో మిగిలింది 16 నియోజకవర్గాలే
- అవీ భర్తీ అయితే... జనసేన, బీజేపీయే దిక్కు
- బెర్త్ కోసం ఆశావహులు ఉరుకులు, పరుగులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఎన్నికల షెడ్యూలు విడుదల కావడంతో అధికార, ప్రతిపక్ష పార్టీల్లో సీట్లు ఆశించి భంగపడ్డ అసంతృప్తివాదుల పరిస్థితి ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. ఆయా పార్టీల్లో సీట్ల భర్తీ ప్రక్రియ పూర్తికావస్తుండడంతో ఆశావాహుల ఆశలు ఆవిరవుతున్నాయి. వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాను ఒకేసారి ప్రకటించడంతో సీట్లు ఆశించి భంగపడ్డవారు ఇతర పార్టీల్లో అవకాశాల కోసం పరుగులు పెడుతున్నారు. అనకాపల్లి పార్లమెంటుకు మినహా రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 24 పార్లమెంటు నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేస్తూ ఆ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 16న తుది జాబితాను ఒకేసారి ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో వైసీపీ నుంచి సీటు ఆశించి అభ్యర్థిత్వం లభించనివారు ఇప్పుడు టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల్లో అవకాశాల కోసం ప్రయత్నాలు

- మిగతా 2 లో



## తిరుప్పూర్, నాగపట్నం నుంచి సుబ్బరాయన్, సెల్వరాజ్ పోటీ

చెన్నై: తమిళనాడులో డీఎంకే నేతృత్వంలోని కూటమిలో భాగంగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సోమవారం తిరుప్పూర్ సిట్టింగ్ ఎంపీ కె.సుబ్బరాయన్‌ను తన సొంత నియోజకవర్గం నుంచి ప్రజల తీర్పును కోరడానికి మళ్లీ అభ్యర్థిగా ఎంపిక చేసింది. నాగపట్నం లోక్‌సభ నియోజకవర్గం నుంచి వై.సెల్వరాజ్‌ను పోటీకి దింపినట్లు సీపీఐ కార్యదర్శి కె.నారాయణ ఇక్కడ రెండు రోజుల సమావేశం

- మిగతా 2 లో

## గ్రూప్-1 మెయిన్స్‌పై హైకోర్టుకు ప్రభుత్వం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష రద్దు అంశంపై రాష్ట్ర ప్రభుత్వం, ఏపీపీఎస్సీ హైకోర్టును ఆశ్రయించాయి. 2018 గ్రూప్ -1 నోటిఫికేషన్ ఆధారంగా ఏపీపీఎస్సీ నిర్వహించిన మెయిన్స్ పరీక్ష జవాబు పత్రాల మాన్యువల్ మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పునిచ్చింది. రెండోసారి, మూడోసారి మూల్యాంకనాలు చేయడం చట్ట విరుద్ధమని తెలిపింది. దీంతో మెయిన్స్ పరీక్షకు అర్హులైన జాబితాను రద్దు చేసింది. మళ్లీ మెయిన్స్ పరీక్షను నిర్వహించాలని ప్రభుత్వాన్ని, ఏపీపీఎస్సీని ఆదేశించింది. నిబంధనలకు అనుగుణంగా జవాబు పత్రాలను మూల్యాంకనం చేయాలని సూచించింది. హైకోర్టు తీర్పుపై విపక్షాలు స్వాగతించాయి. ప్రభుత్వం చేతగాని తనంతోనే నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని విమర్శించాయి. దీనిపై సీబీఐతో విచారించాలని డిమాండ్ చేశాయి. ఎన్నికల సమయంలో ఈ వివాదం రావడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ మేరకు సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, ఏపీపీఎస్సీ హైకోర్టును ఆశ్రయించాయి. మంగళవారం విచారిస్తామని ధర్మాసనం తెలిపింది.

## 23న ప్రజాస్వామ్య పరిరక్షణ దినం

- దేశవ్యాప్తంగా గ్రామ మహాపంచాయత్‌లు
- బీజేపీ వ్యతిరేక నిరసనల్లో అన్నివర్గాల ప్రజలు పాల్గొనాలి
- ఎస్‌కేఎం పిలుపు

న్యూఢిల్లీ: దేశ స్వాతంత్ర్యం కోసం విప్లవవీరులు భగత్ సింగ్-రాజ్‌గురు-సుఖ్‌దేవ్ ప్రాణాలర్పించిన రోజైన మార్చి23 (1931)న ప్రజాస్వామ్య పరిరక్షణ దినంగా జరుపుకోవాలని సంయుక్త్ కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) దేశ ప్రజలకు పిలుపునిచ్చింది. డబ్బు, కండబలం ముప్పునుంచి ప్రజాస్వామ్యాన్ని, 'కార్పొరేట్-కమ్యునల్-క్రిమినల్-కరప్షన్' కబంధ హస్తాల నుంచి దేశాన్ని రక్షించేందుకు, 2021 అక్టోబర్ 3న లఖింపూర్ ఖేరీ హింసలో రైతుల మృతికి కారణమైన ప్రధాన కుట్రదారు అజయ్ మిశ్రా తేనీకి ఖేరీ సీటు ఇచ్చినందుకు బీజేపీకి వ్యతిరేకంగా గ్రామాలలో అన్ని వర్గాల ప్రజలు 'గ్రామ్ మహా పంచాయత్' పేరిట పెద్ద ఎత్తున నిరసనలు తెలపాలని పేర్కొంది. అలాగే దేశంలోనే అతిపెద్ద అవినీతి కుంభకోణాని (ఎన్నికల బాండ్ల కుంభకోణం)కి పాల్పడిన బీజేపీని శిక్షించాలని కూడా మోర్చా ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈనెల 14న కిసాన్ మజ్దూర్ మహాపంచాయత్‌ను భగ్నం చేయడానికి పోలీసులు చట్టవిరుద్ధంగా రైతుల్ని వేధించడాన్ని మోర్చా తీవ్రంగా ఖండించింది. కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం- హరి సేనకు ప్రాతినిధ్యం 400 మంది రైతులు మార్చి 14వ తేదీ ఉదయం 11 గంటలకు ఢిల్లీలోని నిజాముద్దీన్ రైల్వే స్టేషన్‌కు చేరుకోగా... సాయంత్రం 4 గంటల వరకు పోలీసులు వారిని చుట్టుముట్టి అడ్డుకున్నారు. తరువాత రైతులు సమీపంలోని గురుద్వారాకు వెళ్లారు. కానీ వారికి వసతి, లంగర్

- మిగతా 2 లో

# ప్రజల్లోకి జగన్

- 'మేమంతా సిద్ధం'తో బస్సుయాత్రలు
- తర్వాత పూర్తిస్థాయి ఎన్నికల ప్రచారం
- 21 జిల్లాల్లో బహిరంగ సభలు
- వైసీపీ ప్రాంతీయ సమన్వయకర్తలతో సీఎం భేటీ
- నేడు యాత్ర షెడ్యూలు విడుదల: తలశిల రఘురామ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాబోయే సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సన్నద్ధమయ్యారు. తొలి విడతగా 'మేమంతా సిద్ధం' పేరుతో బస్సుయాత్రలు నిర్వహించనున్నారు. బస్సుయాత్ర ప్రారంభం నుంచి దాదాపు 21 రోజులపాటు జనంలోనే జగన్ నిమగ్నమవుతారు. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు ఈ యాత్ర కొనసాగుతుంది. ఆ తర్వాత కొనసాగింపుగా పూర్తిస్థాయి ఎన్నికల ప్రచారానికి జగన్ శ్రీకారం చుడతారు. ఇదే అంశంపై తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాల యంలో సోమవారం ప్రాంతీయ సమన్వయ కర్తలతో సీఎం జగన్ భేటీ నిర్వహించారు. దీనికి వైవీ సుబ్బారెడ్డి, అయోధ్య రామిరెడ్డి, మిథున్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి తదితర తొమ్మిది మంది సమన్వయకర్తలు, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, ఐ ప్యాక్ టీమ్ నిర్వాహకులు హాజరయ్యారు. సమావేశంలో సీఎం జిల్లా పర్యటనలు, మేనిఫెస్టో, మూడు పార్టీల కూటమిని ఎదుర్కొనే అంశాలపై జగన్ వ్యూహరచన చేశారు. పాలనాపరంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సీఎం బస్సుయాత్రలకు వైసీపీ ప్రణాళిక రచిస్తోంది. అంతకుముందు వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) మీడియా సమావేశం నిర్వహించారు. మేమంతా సిద్ధం పేరుతో సీఎం జగన్ ఈనెల 26 లేదా 27వ తేదీ నుంచి బస్సుయాత్రలు ప్రారంభిస్తారని, దీనికి సంబంధించిన పూర్తిస్థాయి షెడ్యూలు, రూట్ మ్యాప్ మంగళవారం వెల్లడిస్తామన్నారు. రాబోయే ఎన్నికలకు భారీ ప్రణాళికతో వైసీపీ ముందుకు వెళ్తోంది. రెండు దశలుగా ప్రచారాన్ని సీఎం జగన్ చేపడతారు. తొలుత 18వ తేదీ నుంచి ఎన్నికల ప్రచారానికి సీఎం సిద్ధమయ్యారు. ఏపీ ఎన్నికలు నాలుగో దశకు చేరడంతో... దానికి తగిన విధంగా జగన్ తన ప్రచార వ్యూహాన్ని మార్చారు. తొలి విడత ప్రచారంలో భాగంగా మేమంతా సిద్ధం పేరుతో పార్లమెంట్ నియోజకవర్గాల్లో బస్సు యాత్రలు నిర్వహించనున్నారు. ప్రాంతాల వారీగా ఇప్పటికే నాలుగు సిద్ధం సభలను జగన్ చేపట్టారు. అక్కడి నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాలను మినహాయించి, మిగిలిన 21 జిల్లాలు/ పార్లమెంట్ నియోజకవర్గాల్లో మేమంతా సిద్ధం బస్సుయాత్రలు కొనసాగుతాయి. మేమంతా సిద్ధం పేరుతో జిల్లా/ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో క్షేత్రస్థాయిలో సీఎం పర్యటిస్తారు. బస్సుయాత్ర ప్రారంభం నుంచి

- మిగతా 2 లో

## ఇదీ లోకం!

## ఈడీ విచారణకు కేజ్రీవాల్ గైర్హాజరు

### ఢిల్లీ జల్‌బోర్డు కేసులో సమన్లు అక్రమం: ఆప్



న్యూఢిల్లీ: ఢిల్లీ జల్‌బోర్డ్ అవకతవకలకు సంబంధించిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ గైర్హాజరయ్యారు. దీనిపై స్పందించిన అమ్ ఆద్మీ పార్టీ... ఈడీ అధికారులు జారీ చేసిన సమన్లు అక్రమమని, చట్ట వ్యతిరేకంగా జారీ చేశారని ఆరోపించింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ కేజ్రీవాల్‌ను లక్ష్యంగా చేసుకుని కేంద్ర దర్యాప్తు సంస్థలతో దాడులు చేయిస్తోందని పేర్కొంది. ఈ కేసులో కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు జారీ చేయడంపై ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ మాట్లాడుతూ.... 'అరవింద్ కేజ్రీవాల్ ఇండియా కూటమితో కలిసి ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తే బీజేపీకి ఆటంకాలు వస్తాయని భావిస్తోంది. కేజ్రీవాల్‌ను ఎలాగైనా జైలుకి పంపించాలని అనుకుంటోంది. ఢిల్లీ మద్యం కేసులో బెయిల్ వచ్చే సరికి కొత్త కేసును తీసుకొచ్చారు'అని విమర్శించారు. మరోవైపు ఈడీ విచారణకు కేజ్రీవాల్ కావాలనే గైర్హాజరయ్యారని బీజేపీ నేత హరీశ్ ఖురానా ఆరోపించారు. సీఎం కేజ్రీవాల్‌కు చట్టం అంటే గౌరవం లేదనే విషయం మరోసారి రుజువైందని హరీశ్ విమర్శించారు. జల్‌బోర్డ్‌లో అవకతవకలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో సోమవారం తమ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఈడీ సమన్లు జారీ చేసిన సంగతి విదితమే.

## రష్యా అధ్యక్షుడిగా మళ్లీ పుతిన్

### 87శాతం ఓట్లతో ఘన విజయం

**రష్యా అధ్యక్షుడిగా వ్లాదిమిర్ పుతిన్ విజయం సాధించినట్లు రష్యా ఎన్నికల సంఘం ప్రకటించింది. దీంతో మరో ఆరేళ్లు రష్యా అధినేతగా పుతిన్ కొనసాగనున్నారు. వరుసగా ఐదోసారి జయ భేరి మోగించిన పుతిన్... 2012 నుంచి రష్యా అధ్యక్షుడిగా ఏకఛత్రాధిపత్యం వహిస్తుండటం విశేషం.**

2లో

# నా అరెస్టు అక్రమం

- సుప్రీంను ఆశ్రయించిన కవిత
- ఆప్ నేతలతో కలిసి అక్రమాలు: ఈడీ

న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ కుంభకోణం కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఓ పక్క సర్వోన్నత న్యాయ స్థానంలో కేసు విచారణ జరుగుతుండగానే తనను అరెస్ట్ చేశారని పిటిషన్ దాఖలు చేశారు. గతంలో విచారణ సందర్భంగా సమన్లు జారీ చేయబోమని కోర్టుకు చెప్పిన ఈడీ... తనను అక్రమంగా అరెస్టు చేసిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు భావించి, దర్యాప్తు సంస్థపై తగిన చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కవిత తరఫు న్యాయవాది సోమవారం ఆన్‌లైన్ ద్వారా పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీలో ఉన్న కవితను ఆదివారం సాయంత్రం కుటుంబ సభ్యులు ఢిల్లీలోని ఈడీ కార్యాలయంలో కలిశారు. కవిత భర్త అనిల్‌కుమార్, సోదరుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, న్యాయవాది మోహిత్‌రావులు ఆమెను

- మిగతా 2 లో

# రష్యా అధ్యక్షుడిగా మళ్లీ పుతిన్

## 87శాతం ఓట్లతో ఘన విజయం

మాస్కో: రష్యా అధ్యక్షుడిగా వ్లాదిమిర్ పుతిన్ విజయం సాధించినట్లు రష్యా ఎన్నికల సంఘం ప్రకటించింది. దీంతో మరో ఆరేళ్లు రష్యా అధినేతగా పుతిన్ కొనసాగనున్నారు. వరుసగా ఐదోసారి జయభేరి మోగించిన పుతిన్... 2012 నుంచి రష్యా అధ్యక్షుడిగా ఏకచత్రాధిపత్యం వహిస్తుండటం విశేషం. తాజా ఎన్నికల్లో 87 శాతం ఓట్ల(దాదాపు 76 మిలియన్ల ఓట్లు)తో పుతిన్ విజయం సాధించినట్లు రష్యా ఎన్నికల సంఘం పేర్కొంది. రష్యాలో మూడు రోజుల పాటు జరిగిన ఈ అధ్యక్ష ఎన్నికల్లో మొత్తం 74.22 శాతం ఓటింగ్ నమోదవగా... అందులో పుతిన్‌కు అత్యధికంగా 87శాతం ఓట్లు లభించాయని ఎన్నికల సంఘం వివరించింది. పుతిన్‌కు పోటీగా బరిలో ఉన్న న్యూ పీపుల్ పార్టీ అభ్యర్థి వ్లాదిస్లవ్ దవాంకోవ్‌కు 4.8శాతం ఓట్లు పడ్డాయి. మరో అభ్యర్థి కమ్యూనిస్ట్ పార్టీకి చెందిన నికోలోయ్ ఖరితోనోవ్ 4.1శాతం, లిబరల్ డెమొక్రటిక్ పార్టీకి చెందిన లియోనిడ్ స్లట్స్కీకి 3.15 శాతం ఓట్లు లభించాయి. చివరి రోజైన ఆదివారం ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. పుతిన్ విధానాలను వ్యతిరేకిస్తున్నవారు పోలింగ్ కేంద్రాలకు వచ్చి సంఘీభావం ప్రకటించాలని దివంగత విపక్ష నేత అలెక్సీ నావల్నీ మద్దతుదారులు పిలుపునిచ్చారు. దీంతో ఉక్రెయిన్ యుద్ధం, పుతిన్ వ్యతిరేకులు, దివంగత విపక్ష నేత మద్దతుదారులంతా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. పుతిన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బ్యాలెట్ బాక్సుల్లో పెన్ను ఇంకుతో పాటు ఆకుపచ్చ రంగు యాంటీసెప్టిక్ ద్రావణాలను పోశారు. ఈ నిరసనల కారణంగా 16 నగరాల్లో 65 మంది నేతలను పోలీసులు అరెస్టు చేశారు. అటు ఎన్నికలు జరుగుతున్న సమయంలోనే ఉక్రెయిన్ దళాలు రష్యా భూభాగంపై అనేక చోట్ల డ్రోన్లతో దాడులకు పాల్పడ్డాయి. ఈ దాడిలో ఇద్దరు మరణించగా... మరో 11 మంది గాయపడినట్లు అధికారులు తెలిపారు. మరణించిన వారిలో 16 ఏళ్ల బాలిక కూడా ఉందని వెల్లడించారు.

**అడుగు దూరంలో మూడో ప్రపంచ యుద్ధమంటూ హెచ్చరిక**

అధ్యక్షుడిగా ఎన్నికైన పుతిన్ మాట్లాడుతూ... మూడో ప్రపంచ యుద్ధానికి ఈ విశ్వం కేవలం అడుగు దూరంలోనే ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. రష్యా-అమెరికా నేతృత్వంలోని నాటో కూటమి మధ్య ఘర్షణ తలెత్తితే అది మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందని హెచ్చరిస్తూనే... దీన్ని ఎవరూ కోరుకోవడం లేదని తెలిపారు. దివంగత విపక్ష నేత నావల్నీ మృతిపై మాట్లాడుతూ... 'నావల్నీ మరణం ఒక విషాదకర ఘటన. జైలులో ఉన్న వ్యక్తులు మరణించిన సందర్భాలు చాలానే ఉన్నాయి. అయితే నావల్నీ చనిపోవడానికి కొద్ది రోజుల ముందే అతడిని విడుదల చేసే అంశంపై చర్చించాం. ఆయన తిరిగి రష్యాలో అడుగు పెట్టకూడదన్న షరతుతో విడుదల చేయాలని అనుకున్నాం. కానీ, దురదృష్టవశాత్తు జైలులో ఉన్నప్పుడే నావల్నీ మరణించాడు' అని పుతిన్ అన్నారు. నావల్నీ మృతిపై పుతిన్ మాట్లాడటం ఇదే తొలిసారి.

**అణిచివేత, బెదిరింపులు: ఈయూ**

రష్యా ఎన్నికలు స్వేచ్ఛగా జరగలేదని యురోపియన్ యూనియన్ (ఈయూ) ఆరోపించింది. విదేశాంగ విధాన చీఫ్ జోసెఫ్ బోర్నెల్ మాట్లాడుతూ... ఆ ఎన్నికల్లో అణిచివేత, బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపించారు. రష్యా ఎన్నికల ఫలితాలపై త్వరలోనే 27 ఈయూ సభ్యదేశాలు సంయుక్త ప్రకటన చేయనున్నాయి. కాగా పుతిన్ నెగ్గింది సూడో ఎలక్షన్ అని జర్మనీ ఆరోపించింది. ఓటింగ్ స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా జరగలేదని అమెరికా తెలిపింది. అధికార దాహంతో పుతిన్ ఉన్నారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఆరోపించారు. ఎప్పటికీ పరిపాలనను తన చేతుల్లో ఉంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు.

# షిఫా ఆస్పత్రిపై మరోసారి ఇజ్రాయిల్ దాడి

గాజా: గాజాపై ఇజ్రాయిల్ మారణహోమం కొనసాగిస్తోంది. గాజాలోని అతిపెద్ద ఆస్పత్రి షిఫాపై సోమవారం తెల్లవారుజామున ఇజ్రాయిల్ దళాలు దాడికి దిగాయి. అక్కడ హమాస్ మిలిటెంట్లు ఉన్నారని, కాంపౌండ్ లోపల నుండి కాల్పులు జరుపుతున్నారని ఇజ్రాయిల్ దళాలు ఆరోపించాయి. ఇదే సాకుతో గత ఏడాది నవంబర్‌లోనూ షిఫా ఆస్పత్రిపై ఇజ్రాయిల్ దళాలు దాడులు చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే ఆ ఆస్పత్రిలో సుమారు పదివేల మంది ప్రజలు ఆశ్రయం పొందుతున్నారని పలస్తీనా అధికారులు వెల్లడించారు. ఇజ్రాయిల్ దళాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ... అమాయక పౌరుల ప్రాణాలు తీస్తున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం తెల్లవారుజామున ఇజ్రాయిల్ దళాలు ట్యాంకులు, ఫిరంగులతో మెడికల్ కాంప్లెక్స్‌ను చుట్టుముట్టాయని, లోపల ఉన్న వారిపై కాల్పులు జరిపినట్లు ఆస్పత్రిలో ఆశ్రయం పొందుతున్న వ్యక్తులు తెలిపారు. భవనాలపై దాడి చేయడంతో పాటు డజన్ల కొద్దీ పౌరులను అదుపులోకి తీసుకున్నాయని వెల్లడించారు. తాము లోపల చిక్కుకుపోయామని మూడు నెలలుగా ఈ ఆస్పత్రిలో ఆశ్రయం పొందుతున్న అబ్దుల్ హదీ సయ్యద్ అనే వ్యక్తి తెలిపారు. కదిలితే ఇజ్రాయిల్ దళాలు కాల్పులు జరుపుతున్నాయని, దీంతో వైద్యులు ఎక్కడికక్కడ నిలిచిపోయారని, అంబులెన్స్ సేవలు ఆగిపోయాయని పేర్కొన్నారు. కాగా ఆస్పత్రిలోని కొన్ని భవనాలపై సైన్యం నిర్దిష్ట ఆపరేషన్ ప్రారంభించిందని ఇజ్రాయిల్ చీఫ్ మిలటరీ ప్రతినిధి డేనియల్ హగారీ తెలిపారు. ఆ ఆస్పత్రిలో హమాస్ మిలిటెంట్లు ఉన్నారని, దాడు లకు యత్నిస్తున్నారని చెప్పుకొచ్చారు. దాడిలో భాగంగా తమ బలగాలు సుమారు 80 మందిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ఆస్పత్రి లోపల నుండి తమ బలగాలపై కాల్పులు జరుపుతున్నారంటూ కొన్ని వీడియోలను సైన్యం విడుదల చేసింది.

# గవర్నర్ పదవికి తమిళిసై రాజీనామా

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై తన పదవికి రాజీనామా చేశారు. అలాగే పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ పదవికి కూడా ఆమె రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను సోమవారం ఉదయం రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్‌కు పంపారు. రాజీనామాను వెంటనే ఆమోదించాలని ఆమె రాష్ట్రపతిని కోరారు. తమిళనాడు నుంచి లోక్‌సభకు పోటీ చేసే అవకాశం ఉన్నట్టు తెలిసింది. చెన్నై సౌత్, తిరునల్వేలి, కన్యాకుమారిలో ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం. తమిళిసై నాడార్ సామాజిక వర్గానికి చెందినవారు. తిరునల్వేలి, కన్యాకుమారిలో అత్యధికంగా నాడార్ సామాజికవర్గం ఓట్లు ఉన్నట్లు తెలుస్తుంది.

**ప్రజాసేవ కోసమే...**

గవర్నర్ పదవికి రాజీనామా చేయడంపై తమిళిసై సౌందరరాజన్ స్పందించారు. "ప్రజా సేవ కోసం తిరిగి వెళ్తున్నా. తెలంగాణ ప్రజలందరికీ ధన్యవాదాలు. నేను ఎప్పటికీ మీ సోదరినే. నాపై చూపిన ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు" అని తెలిపారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో తమిళనాడు నుంచి బీజేపీ తరపున ఆమె బరిలోకి దిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గవర్నర్ పదవి చేపట్టకముందు బీజేపీ తమిళనాడు అధ్యక్షురాలిగా ఆమె వ్యవహరించారు. 2019 సెప్టెంబరు 8న ఆమె తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు కూడా నిర్వర్తించారు. ఈ పదవికి కూడా ఆమె రాజీనామా సమర్పించారు.

# పోలీసులు నిర్లక్ష్యం ప్రదర్శించారు

## ఈసీకి ఎన్డీఏ నేతల ఫిర్యాదు

విశాలాంధ్ర-విజయవాడ: చిలకలూరిపేటలో జరిగిన ప్రజాగళం సభలో పోలీసుల నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ఎన్డీఏ నేతలు సోమవారం రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మాట్లాడుతూ సభను భగ్నం చేయాలని నలుగురు పోలీసు అధికారులు కంకణం కట్టుకున్నారని ఆరోపించారు. ఎన్నికల కోడ్ వచ్చాక కూడా పోలీసు శాఖ బరితెగించి వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఎన్డీఏ అధ్వర్యంలో నిర్వహించిన ప్రజాగళం సభకు సాక్షాత్తు భారత ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారని, ఆ సభకు తాము ఊహించిన దానికంటే లక్షలాది మంది కదలి వచ్చారని చెప్పారు. ఈ సభకు కావాల్సిన భద్రతా ఏర్పాట్లు చేయండని ఈ నెల 12వ తేదీన రాష్ట్ర డీజీపీకి తెలుగుదేశం పార్టీ నుంచి లేఖ పంపించటం జరిగిందన్నారు. అయినా నిమ్మకు నీరెత్తినట్లు పోలీసులు కూర్చొని సభను భగ్నం చేసేందుకు కుట్రపన్నారని విమర్శించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించలేదని, విద్యుత్, సౌండ్ బాక్సుల స్తంభాల పైకి అభిమానులు, కార్యకర్తలు ఎక్కితే, వారిని దింపేందుకు సాయం చేయమని తాము పోలీసు వారిని కోరినా పట్టించుకోలే దన్నారు. ప్రోటోకాల్‌ను కూడా ఉల్లంఘించి విద్యుత్ స్తంభాలు దిగాలని స్వయంగా ప్రధానే విజ్ఞప్తి చేయటం జరిగిందన్నారు. పల్నాడు ఎస్పీ వైసీపీ కార్యకర్తగా వ్యవహరించారని రామయ్య దుయ్యబట్టారు. ప్రధాని ప్రసంగించే సభలో మైక్ ఆగిపోవడం ఏమిటి? ప్రధాని మాట్లాడుతుంటే కరెంట్ పోవడం ఎప్పుడైనా ఉందా? ప్రధాని ప్రసంగంలో 11 నిమిషాలు కరెంట్ పోవడం ఏమిటి? ఇది కేవలం పోలీసుల వైఫల్యం మాత్రమే అన్నారు. డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఏడీజీ పీఎస్ఆర్ ఆంజనేయులు, గుంటూరు రేంజ్ ఐజీ పాల్‌రాజ్, పల్నాడు ఎస్పీ రవిశంకర్ రెడ్డిలపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆధారాలతో సహా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ నలుగురు అధికారులు ఎన్నికలయ్యేంతవరకు ఎటువంటి కార్యకలాపాల్లో, విధుల్లో ఉండకుండా దూరంగా పెట్టాలని ఎన్నికల అధికారిని కోరామని రామయ్య తెలిపారు. బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌ఛార్జ్ పాతూరి నాగభూషణం మాట్లాడుతూ అధికార పక్షానికి పోలీసులు కొమ్ము కాశారని విమర్శించారు. ప్రధాని విషయంలో ప్రోటోకాల్ పాటించని నాటి తెలంగాణ ముఖ్యమంత్రి పరిస్థితి ఇప్పుడెలా ఉందో మనందరికి తెలుసునన్నారు. ప్రధానిని సత్కరించేందుకు, స్వాగతించేందుకు బొకేలు, శాలువాలు కూడా స్టేజ్ మీదకు తీసుకెళ్లని వ్వకుండా పల్నాడు ఎస్పీ అడ్డుకున్నారని... రానున్న రోజుల్లో జరిగే మోదీ, అమిత్ షా సభల్లో ఇటు వంటి దుర్మార్గ చర్యలు జరగకుండా ఉండాలని ఈసీకి ఫిర్యాదు చేశామన్నారు. ప్రజాగళం సభలో పోలీసుల తీరుపై పీఎంవోకు కూడా ఫిర్యాదు చేస్తామని నాగభూషణం తెలిపారు. జనసేన కృష్ణా జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, చిల్లపల్లి శ్రీనివాసరావు, బుచ్చి రాంప్రసాద్, షేక్ బాజీ పాల్గొన్నారు.

# బీజేపీకి 17... జేడీయూకు 16

## చిరాగ్ పార్టీ ఎల్‌జేపీకి 5 స్థానాలు

న్యూఢిల్లీ: బీహార్‌లో లోక్‌సభ ఎన్నికల కోసం ఎన్‌డీఏ కూటమి సోమవారం తన సీట్ల భాగస్వామ్య ఫార్ములాను ప్రకటించింది. బీజేపీకి 17, జేడీయూకు 16, చిరాగ్ పాశ్వాన్‌కు చెందిన ఎల్‌జేపీ (రామ్ విలాస్) కు ఐదు సీట్లు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇక ఎన్‌డీఏలో మరో మిత్రపక్షాల పార్టీలు హిందుస్థానీ అవామ్ మోర్చా (హెచ్ఏఎం), ఉపేంద్ర కుష్వాహా నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్ మోర్చా చెరొక స్థానం నుంచి పోటీ చేయనున్నట్లు బీహార్‌లో బీజేపీ ఎన్నికల ఇన్‌ఛార్జ్ వినోద్ తావ్డే ఇక్కడ విలేకరుల సమావేశంలో తెలిపారు. 'మొత్తం 40 స్థానాల్లో బీజేపీ 17 స్థానాల్లో, జేడీయూ 16 స్థానాల్లో పోటీ చేస్తుంది. లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) ఐదు స్థానాల్లో పోటీ చేస్తుంది' అని అన్నారు. ఎల్‌జేపీ బీహార్ (రామ్‌విలాస్) అధ్యక్షుడు రాజు తివారీ మాట్లాడుతూ చిరాగ్ పాశ్వాన్ హాజీపూర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తారని, ఈ సీటు భాగస్వామ్య ఒప్పందం ప్రకారం పార్టీకి కేటాయించినట్లు వివరించారు. సీట్ల పంపకాల ఒప్పందంలో కేంద్ర మంత్రి పశుపతి పరాస్‌కు చెందిన ఎల్‌జేపీ వర్గం ప్రస్తావన లేకపోవడంతో బీజేపీ బీహార్ అధ్యక్షుడు సామ్రాట్ చౌదరి ఆయనతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు.

# ఎన్నికల బాండ్ల నంబర్లూ చెప్పాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

తావులేదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ఎన్నికల బాండ్లకు సంబంధించిన పూర్తి వివరాలను (నంబర్లతో సహా) ఈసీకి ఇచ్చేశామని చెబుతూ మార్చి 21 సాయంత్రం 5 గంటల్లోగా సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాలని ఎస్‌బీఐ ఛైర్మన్‌ను ధర్మాసనం ఆదేశించింది. వివరాలు అందిన వెంటనే వాటిని ఎన్నికల సంఘం తమ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేసింది. ఎన్నికల బాండ్లను రద్దు చేస్తూ ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. గత ఐదేళ్లలో జారీ చేసిన బాండ్ల వివరాలను ఈసీకి అందించాలని ఎస్‌బీఐని ఆదేశించింది. ఆ సమాచారాన్ని కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన బ్యాంకు... బాండ్ల ఆల్ఫా న్యూమరిక్ నంబర్లను మాత్రం బయటపెట్టలేదు. ఏ వ్యక్తి/సంస్థ బాండ్లను ఏ పార్టీకి విరాళంగా ఇచ్చారని తెలిపే ఈ నంబర్లు లేకపోవడంపై సుప్రీంకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం బ్యాంకు తీరుపై అసహనం వ్యక్తం చేసింది.

# ఎన్నికల బాండ్ల ద్వారా జనసేనకు రూ.21 కోట్లు

న్యూఢిల్లీ: ఎన్నికల బాండ్ల ద్వారా విరాళాలు అందుకున్న ఏకైక గుర్తింపు లేని పార్టీ పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ (జేఎస్పీ) అని కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) ఆదివారం తన వెబ్‌సైట్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచిన వివరాలను ఉటంకిస్తూ ఒక ఆంగ్ల వార్తా సంస్థ కథనం పేర్కొంది. కాగా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో బీజేపీ-టీడీపీ కూటమి భాగస్వామిగా జనసేన పార్టీ ఉంది. నివేదిక ప్రకారం, గుర్తింపు లేని పార్టీలు 2019-2021 మధ్య ఎన్నికల బాండ్ల ద్వారా ఎటువంటి విరాళాలను స్వీకరించలేదు. అయితే, జనసేన మాత్రమే 2022లో రూ.2 కోట్లు, 2023లో మరో రూ.2 కోట్లు, 2024లో రూ.17 కోట్లతో మొత్తం రూ.21 కోట్లను అందుకుంది. అన్ని పార్టీలు అందుకున్న మొత్తం విరాళాలు 12,769 కోట్ల రూపాయలలో 0.2 శాతం 'గుర్తింపు లేని' పార్టీ విభాగంలో జనసేన స్వీకరించినట్లు పేర్కొంది. గుర్తింపు లేని పార్టీలు అంటే కొత్తవి లేదా మునుపటి ఎన్నికలలో తగినన్ని ఓట్లను సంపాదించనందున రిజర్వ్ చేయబడిన గుర్తు లేని రాజకీయ పార్టీలు.

# సుబ్బరాయన్, సెల్వరాజ్ పోటీ

(మొదటిపేజీ తరువాయి)

ముగింపు సందర్భంగా ప్రకటించారు. సీట్ల పంపకాల చర్చల్లో అధికార డీఎంకే ఈ రెండు నియోజకవర్గాలను సీపీఐకి కేటాయించింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఆర్.ముత్తరాసన్ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ తమిళనాడులో ఏప్రిల్ 19న ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల సంఘం ప్రకటించడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 39 నియోజకవర్గాల్లో రాజకీయ పార్టీలు పూర్తిస్థాయి ప్రచారాన్ని చేపట్టేందుకు వీలులేకుండా పోయిందని తెలిపారు. మరోవైపు డీఎంకేకు కేటాయించిన తిరుచిరాపల్లి స్థానం నుంచి తన కుమారుడు దురై వైకో పోటీ చేస్తారని డీఎంకే మరో మిత్రపక్షం మరుమలార్చి ద్రవిడ మున్నేట్ర కజగం (ఎండీఎంకే) అధినేత వైకో ప్రకటించారు. ఎండీఎంకే ప్రధాన కార్యదర్శిగా దురై పదోన్నతి పొందారు.

# ఈసీ కొరడా...

(మొదటిపేజీ తరువాయి)

డిప్యూటీ కమిషనర్లను కూడా తొలగించాలని ఆదేశించినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఎన్నికల సంబంధిత పనులతో సంబంధం ఉన్న మూడేళ్లు పూర్తి చేసుకున్న లేదా సొంత జిల్లాల్లో ఉన్న అధికారులను బదిలీ చేయాలని కమిషన్ అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. అయితే కొంతమంది మునిసిపల్ కమిషనర్లు, మరికొందరు అదనపు, డిప్యూటీ మునిసిపల్ కమిషనర్లకు సంబంధించి మహారాష్ట్ర ఆదేశాలను పాటించలేదు. దీంతో ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తన అసంతృప్తిని తెలియజేస్తూ, సోమవారం సాయంత్రం 6 గంటలలోపు నివేదిక ఇవ్వాలని, బీఎంసీకి చెందిన అదనపు, డిప్యూటీ కమిషనర్లను బదిలీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అలాగే మహారాష్ట్రలోని ఇతర కార్పొరేషన్ల మునిసిపల్ కమిషనర్లు, అదనపు లేదా డిప్యూటీ కమిషనర్‌లందరినీ బదిలీ చేయాలని ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. ఈ మేరకు తొలగించా ల్సిందిగా ఆదేశించిన సిబ్బంది ప్రతి రాష్ట్రంలోని సంబంధిత ముఖ్యమంత్రుల కార్యాలయాలలో ద్వంద్వ బాధ్యతలను కలిగి ఉన్నట్లు గుర్తించింది. ఇది రాజీ పడవచ్చు లేదా రాజీ పడుతున్నట్లు కనిపించవచ్చు. ముఖ్యంగా శాంతిభద్రతలకు సంబంధించి ముందుగా, పోలింగ్ సమయంలో, ఆ తర్వాత తటస్థత అవసరమని సీఈసీ భావించిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఈ చర్యకు సంబంధించి గత పరిణామాలను పరిశీలిస్తే... ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్ ప్రసాద్‌కు 2022లో హోం శాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పార్టీకి సన్నిహితుడని కొందరు భావిస్తున్న డీజీపీ రాజీవ్ మాలిక్‌ను తొలగించడంపై పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ ఇంకా స్పందించలేదు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు దగ్గరగా ఉన్న సీనియర్ సివిల్ సర్వీస్, పోలీసు అధికారులను చివరి నిమిషంలో తిరిగి మార్చడాన్ని ప్రశ్నించింది. కొత్త ముఖాలను ఆ పోస్టుల్లో సర్దుబాటు చేయడానికి సమయం కావాల్సి ఉంటుందని, ఇది వాస్తవానికి ఎన్నికల సన్నద్ధతకు ఆటంకం కలిగిస్తుందని వాదించింది. పోలింగ్ సమయంలో బెంగాల్ తరచుగా హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. గత ఏడాది జూన్‌లో పంచాయతీ ఎన్నికలకు ఓటింగ్ జరుగుతుండగా రాష్ట్రవ్యాప్తంగా 12 మందికి పైగా మరణించారు. ప్రతిపక్షాలు హింసను ప్రేరేపించాయని తృణమూల్ ఆరోపించింది. ఓటర్లను రక్షించడంలో కేంద్ర బలగాలు విఫలమయ్యాయని విమర్శించగా, రాష్ట్రం ప్రజలపై దుండగులను వదిలిందని కాంగ్రెస్ ఆరోపించింది. ఎన్నికల సంఘం సమగ్రతను నిర్ధారించే ప్రక్రియలో ఇదొక భాగమని సీఈసీ రాజీవ్ కుమార్ అనేక సందర్భాల్లో చెప్పారు. ఎన్నికల్లో ఎటువంటి హింస సంభవించినా ఎన్నికల సంఘం ప్రతిష్ట మసకబారుతుందన్నారు. అటువంటి సంఘటన ఏదైనా జరిగినప్పుడు కఠినంగా వ్యవహరించడానికి ఈసీ సిద్ధంగా ఉందని తెలిపారు. 'మేము రాజకీయ పార్టీలను నోటీసులో ఉంచుతున్నాము'' అని ఆయన ప్రకటించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి కట్టుబడి ఉండాల్సిన ప్రాముఖ్యతను నొక్కిచెప్పిన ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, ప్రచారంలో రెడ్ లైన్ దాటవద్దని పార్టీలను హెచ్చరించిన విషయం తెలిసిందే. 'మేము గతాన్ని, చరిత్రను కూడా పరిశీలిస్తాం. క్రమాంకనం చేసిన విధానాన్ని తీసుకుంటాం' అని కూడా స్పష్టం చేశారు. ఏప్రిల్ 19న ఓటింగ్ ప్రారంభమై జూన్ 1 వరకు ఏడు దశల్లో పోలింగ్ ప్రక్రియ జరుగుతుందని, జూన్ 4 న ఫలితాలు వెలువడతాయని ఈసీ శనివారం తెలిపింది. దీంతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోకి వచ్చింది.

# అసంతృప్తుల దారెటు?

(మొదటిపేజీ తరువాయి)

ముమ్మరం చేశారు. సహజంగా సీట్ల కోసం అధికార, ప్రతిపక్ష పార్టీల్లో పోటీ ఎక్కువగా ఉంటుంది. వైసీపీ ఒకేసారి అన్నిస్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయగా, టీడీపీ 16 అసెంబ్లీ నియోజకవర్గాలకు మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఎన్నికల పొత్తులో భాగంగా జనసేనకు 21, బీజేపీకి 10 అసెంబ్లీ స్థానాలు కేటాయించింది. దీంతో కేవలం 144 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి మాత్రమే టీడీపీ పోటీ చేస్తుంది. వీటిలో తొలివిడతగా 94 మందిని, మలి విడతో 34 మంది అభ్యర్థులను ఖరారు చేసింది. అలాగే జనసేనకు రెండు ఎంపీ, బీజేపీకి ఆరు పార్లమెంటు స్థానాలను కేటాయించింది. మిగిలిన 17 ఎంపీ స్థానాల నుంచి టీడీపీ పోటీ చేయనుంది. ఎంపీ అభ్యర్థులను మాత్రం ఇంతవరకు ఖరారు చేయలేదు. రెండు, మూడు రోజుల్లో 17 ఎంపీ స్థానాలతో పాటు, మిగిలిన 16 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒకేసారి అభ్యర్థులను ప్రకటించి, ఇక పూర్తిస్థాయిలో ఎన్నికల కదనరంగంలోకి దిగాలని చంద్రబాబు యోచిస్తున్నారు. ఇందుకోసం అభ్యర్థుల ఎంపికపై తీవ్ర కసరత్తు నిర్వహిస్తున్నారు.

సీట్ల కేటాయింపులో వైసీపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు పెద్దసంఖ్యలో కేటాయింపులు చేసింది. దాదాపు 175లో సగం సీట్లు వారికి కేటాయించింది. దానిని పరిగణనలోకి తీసుకుని సాధ్యమైనంత వరకు ఆయా వర్గాల నుంచే బలమైన నేతలను ఎంపిక చేసేందుకు చంద్రబాబు కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీలో సీట్లు కోల్పోయినవారు, పొత్తులో భాగంగా జనసేన, బీజేపీకి కేటాయించిన స్థానాల్లో సీటు గల్లంతైన టీడీపీ నేతలు ప్రత్యామ్నాయం కోసం నానా పాట్లు పెడుతున్నారు. ఎన్డీఏ కూటమి కూడా అన్ని స్థానాలకు అభ్యర్థిత్వాలు ఖరారు చేయకముందే త్వరపడాలని తమ వంతు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఎలాగైనా సరే సీటు దక్కించుకోవాలి, బరిలో ఉండాలన్న ధ్యేయంతో అవకాశాల కోసం నేతలు అర్రులు చాస్తున్నారు. టికెట్ ఇస్తే చాలు ఏ పార్టీ అయినా ఒకటేనన్న బరితెగింపు నేతల్లో స్పష్టంగా కనపడుతోంది. అయితే వైసీపీ అన్ని స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయడంతో, ఆపార్టీలో అవకాశాలు పూర్తిగా కొరవడగా, ప్రత్యామ్నాయంగా సీట్లు రానివారంతా టీడీపీ వైపు చూస్తున్నారు. కాని టీడీపీ తుది జాబితాకు ఇప్పటికే పోటీ ఎక్కువగా ఉంది. ఈసారి ఆ పార్టీలో కొత్తవారికి దాదాపు 40 మందికి అవకాశం కల్పించడంతో సీనియర్లు చాలా మంది మిగిలిపోయారు. అలాగే జనసేన, బీజేపీతో ఎన్నికల పొత్తు కారణంగా 31 స్థానాల్లో టీడీపీ నేతల సీట్లు గల్లంతయ్యాయి. వీరంతా ఇప్పుడు నాయకత్వ కొరత కనపడుతున్న జనసేన, బీజేపీల వైపు చూస్తున్నారు. జనసేనకు కేటాయించిన 21స్థానాల్లో ఇప్పటివరకు ఆరు నియోజకవర్గాలకు మాత్రమే అభ్యర్థులను ఎంపిక చేసింది. మిగిలిన 15 స్థానాలకు ఖరారు చేయాల్సి ఉంది. అలాగే బీజేపీకి కేటాయించిన 10 స్థానాల్లో నాలుగు స్థానాలకు మాత్రమే బలమైన అభ్యర్థులున్నారు. దీంతో ఆయా స్థానాలు ఏ సామాజికవర్గాలకు కేటాయించే అవకాశం ఉందో తెలుసుకుంటూ, ఆ టికెట్‌ను వారు సాధించేందుకు తమ సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. రాష్ట్ర, కేంద్రస్థాయిలో తమకు అండగా ఉండే రాజకీయ ఉద్దండులను కూడా ప్రయోగిస్తున్నారు. మొత్తానికి ఎన్డీఏ కూటమి ప్రకటించనున్న తుది జాబితాపైనే సీట్లు రాని అసంతృప్తివాదులంతా ఆశలు పెట్టుకున్నారు.

# ప్రజల్లోకి జగన్

(మొదటిపేజీ తరువాయి)

చివరి వరకు జనంలోనే జగన్ ఉంటారు. ప్రతిరోజూ ఒక జిల్లా/పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా యాత్ర ఉంటుంది. ఉదయం ప్రజలతో జగన్ మమేకమై వారి నుంచి సలహాలు, సూచనలను సీఎం స్వీకరిస్తారు. అదేరోజు సాయంత్రం భారీ బహిరంగ సభలు నిర్వహిస్తారు. రాబోయే 50 రోజులపాటు పూర్తిగా ప్రజల్లోనే జగన్ ఉండేందుకు నిర్ణయించారు. తొలి విడతలో బస్సుయాత్రలు పూర్తయ్యాక రాష్ట్రవ్యాప్తంగా రోజుకు మూడు ప్రాంతాలను కవర్ చేసేలా (రోజుకు మూడు సభలు/రోడ్ షోలు) అన్ని నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచార సభలు చేపడతారు. ఇప్పటికే వైసీపీ అసెంబ్లీ, ఎంపీ అభ్యర్థుల జాబితాను పూర్తిస్థాయిలో ప్రకటించారు. ఈనెల 20వ తేదీన విడుదల చేయాల్సిన మేనిఫెస్టోను సీఎం వాయిదా వేశారు. ఈలోగా బస్సుయాత్రలతో తన ప్రచారాన్ని ఉధృతం చేయనున్నారు.

**బస్సు యాత్రలు విజయవంతం చేయాలి: జగన్**

సిద్ధం సభల తరహాలో నిర్వహించబోయే బస్సు యాత్రల విజయవంతానికి కృషి చేయాలని వైసీపీ అధినేత, సీఎం జగన్ కోరారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వైసీపీ ప్రాంతీయ సమన్వయకర్తలతో సోమవారం జరిగిన సమావేశంలో 'మేమంతా సిద్ధం' పేరుతో నిర్వహించబోయే బస్సు యాత్రలపై సీఎం వారికి దిశానిర్దేశం చేశారు. అభ్యర్థులకు సరిపడా సమయం ఉందని, ఎన్నికల షెడ్యూలు వల్ల ఈ వెసులుబాటు వస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి సచివాలయాన్ని సందర్శించి ప్రజల ఆశీర్వాదం పొందాలన్నారు.

# నా అరెస్టు అక్రమం

(మొదటిపేజీ తరువాయి)

కలిశారు. రోజూ సాయంత్రం 6 నుంచి 7 గంటల మధ్యలో ఆమెను కలవడానికి రౌజ్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి అనుమతిచ్చారు. కస్టడీలో భాగంగా తొలి రోజైన ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కవితను ఈడీ విచారిం చింది. విచారణ ముగిసిన అనంతరం ఆమెను కలవడానికి కుటుంబసభ్యులకు అధికారులు అవకాశం ఇచ్చారు. ఈడీ కార్యాలయం వరకు పార్లమెంట్ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కూడా వచ్చినా, వారు బయటే ఉండిపోయారు. కవితను కలిసిన తర్వాత కుటుంబీకులు ఎవరూ మీడియాతో మాట్లాడలేదు. న్యాయ పోరాటం చేద్దామని కవితకు ధైర్యం చెప్పినట్లు సమా చారం. గత శుక్రవారం కవిత ఇంట్లో జరిపిన సోదాల సమ యంలో 5 సెల్ ఫోన్లను ఈడీ స్వాధీనం చేసుకోగా, వాటిలో రెండు ఫోన్లు కవితవి కాగా, మిగిలినవి ఆమె వ్యక్తిగత సహాయ కులు వాడుతున్నట్లు సమాచారం. వారందరితో పాటు మరికొం తమందిని సోమవారం ఈడీ విచారణకు పిలిచినట్లు తెలిసింది.

**కవిత అక్రమాలకు పాల్పడ్డారు: ఈడీ**

కాగా ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈ నెల 15న అరెస్టు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్(ఈడీ) వెల్లడించింది. దీనిపై సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఢిల్లీలోని రౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టు ఆమెను ఏడు రోజుల కస్టడీకి అనుమతించగా.. ఈ నెల 23వ తేదీ వరకు కస్టడీకి తీసుకున్నట్లు ఈడీ తెలిపింది. 'ఈ నెల 15న కవిత ఇంట్లో సోదాలు నిర్వహించాం. ఆ సమయంలో ఆమె బంధువులు, అనుచరులు మా విధులకు ఆటంకం కలిగించారు. ఆప్ నేతలతో కలిసి కవిత అక్రమాలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. ఢిల్లీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియాతో కలిసి కుట్ర పన్నారు. 2021-22 లో మద్యం కుంభకోణానికి పాల్పడ్డారు. మద్యం పాలసీని నిబంధనలకు విరుద్ధంగా రూపొందించారు. హోల్‌సేల్ డీలర్ల నుంచి వచ్చిన డబ్బును వాటాలుగా పంచుకున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీకి కవిత రూ.100 కోట్లు చెల్లించారు. ఈ కేసులో ఇప్పటి వరకు హైదరాబాద్, చెన్నై, ముంబై సహా 245 ప్రాంతాల్లో సోదాలు చేశాం. మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్, విజయ్ నాయర్‌తోపాటు మొత్తం 15 మందిని అరెస్టు చేశాం. రూ. 128.79 కోట్ల నగదు సీజ్ చేశాం' అని ఈడీ పేర్కొంది. కేసులో ఒక నేరాభియోగపత్రం, 5 అనుబంధ పత్రాలు దాఖలు చేసినట్లు తెలిపిన ఈడీ... ఈ కేసులో ఇంకా లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొంది.

# 23న ప్రజాస్వామ్య పరిరక్షణ దినం

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేయకుండా చేశారు. రైతులకు ఆతిథ్యం ఇవ్వవద్దని ఢిల్లీ పోలీసుల నుండి ఆదేశాలు ఉన్నాయని గురుద్వారా యాజమాన్యాన్ని బెదిరించారు. దీంతో అన్నదాతలు రాత్రిపూట ఆహారం లేకుండా వీధిలో గడపవలసి వచ్చింది. ఢిల్లీ పోలీసులు ఏఐకెకెఎంఎస్‌కు చెందిన ఐదుగురు రైతు నాయకులను, పంజాబ్‌కు చెందిన 55 మంది రైతులను బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. రైతులను మహాపంచాయత్‌లో చేరకుండా నిరోధించడానికి న్యూఢిల్లీ ప్రాంతంలో భయానక వాతావరణాన్ని సృష్టించారు. ఇదంతా ఢిల్లీ పోలీసులపై మోదీ ప్రభుత్వ రాజకీయ జోక్యాన్ని సూచిస్తుందని కిసాన్ మోర్చా అభిప్రాయపడింది. కార్పొరేట్లకు కొమ్ము కాస్తున్న బీజేపీ అసలు రంగు బట్టబయలు చేయడం ద్వారా ప్రజాకోర్టులో శిక్షపడేలా చేయడానికి 23 మార్చి 2024న నిర్వహించే గ్రామ మహాపంచాయత్‌లో భాగస్వాములు కావాలని కార్మికులు, యువకులు, విద్యార్థులు, మహిళలు, చిన్న వ్యాపారులు, చిరు ఉత్పత్తిదారులతో సహా అన్నివర్గాల ప్రజలకు సంయుక్త కిసాన్‌మోర్చా విజ్ఞప్తి చేసింది.

# గుజరాత్ దొంగలకు దేశ సంపద

**ఎన్నికలలో మోదీని... ఆయన మద్దతుదారులను ఓడిద్దాం: ఈశ్వరయ్య**

**విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు:** నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ సంపదనంతా గుజరాత్‌కు చెందిన అదానీ, అంబానీకి అప్పగిస్తున్నారని, కొందరు మోదీ అనుయాయులు బ్యాంకుల వద్ద వేల కోట్ల రూపాయలు అప్పులు తీసుకుని, వాటిని ఎగవేసి ఇతర దేశాల్లో విలాసవంతమైన జీవితాలు అనుభవిస్తున్నారని, అటువంటి వారికి మోదీ కాపలా కాస్తున్నారని ఏఐవైఎఫ్ జాతీయ మాజీ కార్యదర్శి జి.ఈశ్వరయ్య విమర్శించారు. సోమవారం సీఆర్ భవన్‌లో వాయిస్ ఆఫ్ యంగ్ ఇండియా నినాదంతో ఏఐవైఎఫ్ అధ్వర్యంలో 'ఉద్యోగ, ఉపాధి కల్పన-పాలకుల విధానాలు యువత కర్తవ్యం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రధాని మోదీ ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను నెరవేర్చకుండా అధికారంలోకి వచ్చిన 10 సంవత్సరాల నుంచి చెప్పిన అబద్ధాలనే మరలా చెప్పకుండా ప్రజలను, యువతను మోసం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. దేశంలో 140 కోట్ల మంది జనాభా ఉంటే అందులో 45 శాతం యువత ఉందన్నారు. ఏ దేశం అభివృద్ధి చెందాలన్నా యువతపై ఆధారపడి ఉంటుందన్నారు. ఈ ఎన్నికల్లో కోటీ 80 లక్షల మంది మొదటిసారిగా ఓటు హక్కు వినియోగించు కుంటున్నారని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు యువతను పాలకులు పట్టించుకోవడం లేదని చెప్పిన నేటి పాలకులు అధికారంలోకి వచ్చిన తరువాత ఏమి చేశారని ప్రశ్నించారు. మోదీ తన 10 ఏళ్ల పాలనలో 20 కోట్ల ఉద్యోగాలు ఇచ్చారా అని నిలదీశారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. ఎల్ఐసీ, రైల్వే, పోర్టు, విమానాలు, విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తూ చివరకు ఎర్రకోటను కూడా కుదువ పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఆదాయం పెంచుతానన్న మోదీ ఎవరి ఆదాయం పెంచారో చెప్పాలన్నారు. మోదీ పాలనలో రూ.120 లక్షల కోట్ల అప్పు చేశారని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని ప్రైవేటీకరించడం వలన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రిజర్వేషన్లు వర్తించక నష్టపోతున్నారన్నారు. రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు మోదీ కుట్ర చేస్తున్నాడని విమర్శించారు. బాలికలపై అత్యాచారాలు, దాడులు పెరిగిపోయాయని, మణిపూర్‌లో మహిళలను వివస్త్రలను చేసి ఊరేగిస్తుంటే ఈ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దళితులు, మైనారిటీలకు రక్షణ కరువైందన్నారు. శ్రీరాముడు పేరుతో ఓట్లు కొల్లగొట్టాలని, కులాల పేరుతో, మతాల పేరుతో మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్నారన్నారు. మోదీకి, ఆయనకు మద్దతు ఇస్తున్న వారిని ఓడించాలని, యువత గురించి ఆలోచించే వారికి ఓటు వేసి గెలిపించాలని ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. తొలుత ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు మాట్లాడుతూ పాలకుల వైఖరి వలన నేడు యువత ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమగ్ర యువజన విధానం అమలు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూడా ఉపాధి అవకాశాలు లేవని, ఈ ఎన్నికలలో బీజేపీ, వైసీపీలను ఓడించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. అనంతరం సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.ఎన్.రసూల్, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాముడు తదితరులు ప్రసంగించారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కారుమంచి ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి బీసన్న, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

## వైసీపీలోకి టీడీపీ నేత రామచంద్రరావు దంపతులు

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** విశాఖ జిల్లాకు చెందిన పలువురు నేతలు వైసీపీలో చేరారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో సీఎం జగన్ సమక్షంలో విశాఖపట్నంకు చెందిన టీడీపీ సీనియర్ నేత గంపల వెంకట రామచంద్రరావు, ఆయన సతీమణి సంధ్యారాణి వైసీపీలో చేరారు. టీడీపీ విశాఖపట్నం సౌత్, ఈస్ట్ ఎలక్షన్ ఇన్‌చార్జిగా రామచంద్రరావు పనిచేశారు. వాడబలిజ సామాజిక వర్గానికి చెందిన ఆయన గతంలో ఏపీసీసీ జాయింట్ సెక్రటరీగా, ఏపీసీసీ ఓబీసీ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లోను, సెన్సార్ బోర్డు మెంబర్‌గా, పోర్ట్ ట్రస్ట్ డైరెక్టర్‌గా పనిచేశారు.

**డాక్టర్ కంచర్ల అచ్యుతరావు...**

సీఎం జగన్ సమక్షంలో విశాఖపట్నానికి చెందిన డాక్టర్ కంచర్ల అచ్యుతరావు వైసీపీలో చేరారు. గతంలో ప్రజారాజ్యం పార్టీలో ఆయన క్రియాశీలకంగా పనిచేసి, ప్రస్తుతం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, వైజాగ్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గన్నమని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## కొత్త ఓటుకు చివరి అవకాశం

**ఏప్రిల్ 15లోగా 18 ఏళ్లు నిండినవారు అర్హులు**

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనేందుకు యువ ఓటర్లకు ఎన్నికల సంఘం చివరి అవకాశం కల్పించింది. ఏపీలో ఏప్రిల్ 18వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. మే 13వ తేదీ పోలింగ్ జరగనుంది. దీంతో ఏప్రిల్ 15వ తేదీలోగా 18 సంవత్సరాలు నిండే యువతీ, యువకులంతా ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేశ్ కుమార్ మీనా తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హత కల్గినవారంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పదేళ్ల తర్వాత మళ్లీ అదే నాటకం: సజ్జల

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తులు కొత్త కాదని, పదేళ్ల తర్వాత మళ్లీ అదే నాటకం మొదలు పెట్టారని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏ ముఖం పెట్టుకుని ముగ్గురూ ఒకే వేదికపైకి వచ్చారని ప్రశ్నించారు. ప్రజలకు ఏం చేస్తారో చెప్పకుండా విమర్శలకే సమయం వెచ్చిం చారన్నారు. కేవలం సీఎం జగన్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. చిలకలూరిపేటలో సభను నిర్వహించడం చేతకాక, పోలీసులపై విమర్శలా? అని ధ్వజమెత్తారు. 2014లో ఈ కూటమి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని, 2024లో మళ్లీ కలసి ఒకే వేదికపై వచ్చారంటూ ఎద్దేవా చేశారు. పదేళ్ల తర్వాత ఈ కూటమి ఇచ్చిన హామీలన్నీ మర్చిపోయారన్నారు. నాడు విడాకులు తీసుకుని విడిపోయి, విమర్శించుకున్నారని గుర్తుచేశారు. ప్రధాని మోదీని ఆనాడు చంద్రబాబు ఇష్టానుసారంగా దూషించారని చెప్పారు. మళ్లీ ఇప్పుడెందుకు కలిశారో రాష్ట్ర ప్రజలకు వివరణ ఇవ్వాలన్నారు. తక్షణమే అధికారంలోకి రావాలనేదే ఈ కూటమి ఆత్రుత అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# 'పది' పరీక్షలు ప్రారంభం

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 3,473 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థుల కోసం ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించింది. విద్యార్థుల హాల్ టికెట్లను చూపించి ఉచితంగా బస్సుల్లో ప్రయాణించారు. మాల్ ప్రాక్టీస్‌ను నిరోధించేందుకు ప్రశ్నపత్రాలపై క్యూఆర్ కోడ్‌లు ముద్రించారు. ఈనెల 30వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహిస్తారు. పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. మౌలిక సౌకర్యాలను కల్పించారు. ఒంటిపూట బడులూ ప్రారంభమయ్యాయి. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు జరుగుతాయి. పది పరీక్షా కేంద్రాలుగా ఉన్న పాఠశాలల్లో పరీక్షలు జరిగే ఏడు రోజులూ విద్యార్థులకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులు కొనసాగుతాయి.

# టీడీపీతోనే ముస్లింలకు మేలు

- బీజేపీతో పొత్తుపై వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి
- ముస్లిం సంఘాలకు చంద్రబాబు పిలుపు
- ప్రజాగళం పేరుతో మరిన్ని సభలకు నిర్ణయం

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలోనే ముస్లిం వర్గాలకు అన్నివిధాల మేలు జరుగుతుందని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి మొహంలో ఓటమి భయం కొట్టొచ్చినట్లు కనబడుతోందని, అందుకే కోడికత్తి డ్రామా నుండి బాబాయ్ హత్య వరకూ అన్ని అస్త్రాలు ఉపయోగించిన సీఎం... ఇప్పుడు మతాలు, కులాలపై పడ్డారని చంద్రబాబు విమర్శించారు. మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు ఫారూక్ షిబ్లీతో పాటు ముస్లిం సంఘాల నేతలు కొందరు సోమవారం చంద్రబాబును ఉండవల్లి నివాసంలో కలిశారు. ఎన్డీయే కూటమిలో టీడీపీ చేరడంపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని వారు చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ జనసేనతో పొత్తు సమయంలో కుల రాజకీయం చేసి బోల్తాపడిన జగన్, ఆయన బృందం... బీజేపీతో పొత్తు అనగానే మత రాజకీయానికి తెరతీసినట్లు విమర్శించారు. బీజేపీ పొత్తుతో ముస్లిం మైనారిటీలకు నష్టమంటూ వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ముస్లిం సంఘాల నేతలు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ముస్లింలపై జగన్‌కు నిజంగా ప్రేమ ఉంటే రంజాన్ మాసంలో ఇచ్చే రంజాన్ తోఫా ఎందుకు ఇవ్వడం లేదని చంద్రబాబు ప్రశ్నించారు. ముస్లింలకు ఇచ్చే దల్హన్ పథకం, దుకాన్ మాకాన్ సహా పది సంక్షేమ పథకాలు రద్దు చేసిన జగన్...ఎన్నికలు రాగానే మత రాజకీయంతో లబ్ధి పొందాలని చూస్తున్నారని దుయ్య బట్టారు. జగన్ ప్రభుత్వంలో ముస్లింలకు ఒక్క పథకమైనా అమలు చేశారా చెప్పాలని డిమాండ్ చేశారు. మనం కడపలో 90 శాతం పూర్తి చేసిన హజ్‌హౌస్‌ను కూడా పూర్తి చేయలేకపోయిన జగన్‌కు మైనా రిటీల గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. ముస్లింల ఆర్థిక, రాజ కీయ ప్రయోజనాల్లో రాజీ ఉండదని చంద్రబాబు స్పష్టం చేశారు.

**ప్రజాగళం పేరుతో మరిన్ని సభలు**

చిలకలూరిపేటలో ప్రజాగళం పేరుతో మూడు పార్టీల అధ్వర్యాన నిర్వహించిన సభ విజయవంతం కావడంతో... అదే తరహాలో రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని సభలు నిర్వహించాలని చంద్రబాబు నిర్ణయించారు. దీనిపై ఆయన సోమవారం ఆ పార్టీ సీనియర్ నేతలతో చర్చించారు. ఆదివారం 'ప్రజాగళం' సభ జరిగిన తీరుపై చంద్రబాబు సమీక్షించారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున కార్యాచరణపై చర్చించారు. పల్నాడులో ప్రధాని మోదీ పాల్గొన్న సభను విఫలం చేయాలని పోలీసులు అనేక ప్రయత్నాలు చేశారని చంద్రబాబు దృష్టికి నేతలు తీసుకెళ్లారు. పోలీసుల ప్రయత్నాలను ప్రజలు తిప్పి కొట్టారని తెలిపారు. అధికార పార్టీ ఒత్తిడితో సభకు పోలీసులు అనేక ఆటంకాలు కలిగించారని విమర్శించారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా రానున్న ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయాన్ని ఆపలేరని చంద్రబాబు ధీమా వెలిబుచ్చారు.

## వాసిరెడ్డి పద్మకు ఆత్మీయ వీడ్కోలు

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మకు మంగళగిరిలోని మహిళా కమిషన్ కార్యాలయంలో సోమవారం ఆత్మీయ వీడ్కోలు సభ ఘనంగా జరిగింది. సంస్థ సభ్యులు, కార్యాలయం సిబ్బంది ఆమెకు వీడ్కోలు పలికారు. వాసిరెడ్డి పద్మకు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జెల లక్ష్మి, కమిషన్ సభ్యులు ఎస్కే రుకియా బేగం, బూసి వినీత, గడ్డం ఉమా, కార్యదర్శి దాసరి శ్రీలక్ష్మి, మహిళా కమిషన్ రీజనల్ డైరెక్టర్ వై. శైలజ, విశ్రాంత అధికారిణి ఆర్.సూయజ్, టీవీ శ్రీనివాస్, డాక్టర్ కే.వసుంధర తదితరులు వాసిరెడ్డి పద్మను ఘనంగా సన్మానించారు. వాసిరెడ్డి మాట్లాడుతూ, బాధితులకు న్యాయం చేయడంలో మహిళా కమిషన్ సభ్యులు, సిబ్బంది అందించిన సహకారం సంతోషాన్ని ఇచ్చిందంటూ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఎన్నో కష్టాలతో మహిళా కమిషన్‌కు వచ్చే బాధితులకు భరోసా ఇవ్వడానికి చైర్‌పర్సన్‌గా తన పదవీ కాలంలో తగిన న్యాయం చేశానని చెప్పారు. సీఎం జగన్ సహకారంతో మహిళా సాధికారత కోసం కృషి చేశానన్నారు.

# ఇంటర్ మూల్యాంకనం ప్రారంభం

**4న ముగియనున్న ప్రక్రియ - పారదర్శకంగా పదో తరగతి పరీక్షలు**

**పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్**

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమైందని పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 25 జిల్లా కేంద్రాల్లో ఏప్రిల్ 4 వరకు మూల్యాంకన ప్రక్రియ జరుగుతుందన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సుమారు 23 వేల మంది అధ్యాపకులు మూల్యాంకన ప్రక్రియలో పాల్గొని దాదాపు 60 లక్షల జవాబు పత్రాలు మూల్యాంకనం చేస్తారని వెల్లడించారు. ప్రతి కేంద్రంలో ఒక్కో అధ్యాపకుడు రోజుకు 30 జవాబు పత్రాలను మూల్యాంకనం చేస్తారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయని, ఇందుకోసం విద్యార్థులకు పరీక్షా కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించామన్నారు. మార్చి 2024లో జరుగుతున్న పదవ తరగతి పరీక్షలకు నమోదు చేసుకున్న 7,25,618 మంది విద్యార్థులకు 30,234 గదులు అందుబాటులో ఉన్నాయన్నారు. పరీక్ష నిర్వహణ, పర్యవేక్షణ కోసం 35,119 మంది ఇన్విజిలేటర్లు, 156 ఫ్లైయింగ్ స్క్వాడ్లు, 682 సిట్టింగ్ స్క్వాడ్లు విధులు చేపట్టారని తెలిపారు. 130 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి పరీక్షలు సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. పరీక్షలు పారదర్శకంగా జరిగేందుకు వీలుగా ప్రశ్నా పత్రంలోని ప్రతి పేజీ పై భాగంలో క్యూఆర్ కోడ్‌తో పాటు వాటర్ మార్క్‌తో కూడిన వెబ్ డిరగ్ ఫాంట్ కోడ్ కూడా ఉంటుందని, సీసీటీవీ కెమెరాలను సైతం పర్యవేక్షణ కోసం వినియోగిస్తున్నామని తెలిపారు. దేశంలో మొదటిసారిగా ఆంధ్ర ప్రదేశ్‌లో అంధ విద్యార్థుల కోసం ఆడియో ప్రశ్నపత్రాలను పైలట్ ప్రాజెక్టుగా రూపొందించడం వినూత్న చర్యగా అభివర్ణించారు. ప్రత్యేక అవసరాలు ఉన్న 12 మంది విద్యార్థులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని తెలిపారు. భవిష్యత్‌లో ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు ఈ సౌకర్యం మరింత ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులు, పాసైన విద్యార్థుల మధ్య వ్యత్యాసాన్ని మార్క్ షీట్లలో చూపించకుండా ఉండేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని రూపొందించిందని పేర్కొన్నారు. గత ఏడాది పరీక్షల్లో ఫెయిల్ అయిన 1,125 మంది విద్యార్థుల మార్కులను సబ్జెక్టుల వారీగా పరిగణనలోకి తీసుకొని మళ్లీ రెగ్యులర్ విద్యార్థులుగా నమోదు చేసేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు.

## మాకినేని త్రిపుర సుందరి మృతికి సీపీఎం సంతాపం

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** సీపీఎం అగ్రనాయకుడు మాకినేని బసవపున్నయ్య కోడలు, ప్రముఖ వైద్యురాలు మాకినేని త్రిపుర సుందరి మృతికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి సోమవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆమె హైదరాబాద్‌లో అనారోగ్యంతో మృతి చెందారని చెప్పారు. త్రిపుర సుందరి ప్రజా వైద్యులు డాక్టర్ జశ్వంత్ మోహన్ భార్య అని వివరించారు. 12 సంవత్సరాలుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారని, రెండు రోజులు క్రితమే ఆసుపత్రిలో చేరారని, సోమవారం సాయంత్రం తుది శ్వాస విడిచారన్నారు. ఆమె వైద్యురాలిగా ప్రజాసేవ చేయడమేగాకుండా కమ్యూనిస్టు అభిమానిగా జీవిత చరమాంకం వరకు ఉన్నారని పేర్కొన్నారు. త్రిపుర సుందరి రేపల్లె తాలూకా పెదపులివర్రు గ్రామంలో జన్మించారని, గుంటూరు మెడికల్ కాలేజీలో డాక్టర్ చదివి గైనిక్‌లో స్పెషలైజేషన్ చేశారని చెప్పారు. నెల్లూరు ప్రజా వైద్యశాలలో నాలుగు సంవత్సరాలు పనిచేశారని, విజయవాడలో కొంతకాలం సొంతంగా ప్రాక్టీస్ చేసి ఆ తర్వాత మాకినేని రామారావు ప్రజా వైద్యశాలలోను, తదనంతరం నాగార్జున హాస్పిటల్‌లో డాక్టర్ జగన్‌తో కలిసి కొంతకాలం పనిచేశారన్నారు. ఈనెల 20న ఆమె అంత్యక్రియలు హైదరాబాద్‌లో జరుగుతాయని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# పరీక్షల విధానం అస్తవ్యస్తం!

- ప్రశ్నపత్రాల్లో తప్పుడు విధానం
- సీపీఈ విధానం రద్దు
- పాఠశాలల నిర్వహణ నిల్

**విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు:** టోఫెల్, బైజుస్ ట్యాబ్స్, ఐఎఫ్‌పీ ప్యానల్స్, స్మార్ట్ టీవీలతో అంతర్జాతీయ స్థాయిలో బోధన అంటూ ఊదరగొట్టే ప్రభుత్వానికి తరగతి గదిలో విద్యార్థులకు ప్రశ్నాపత్రాలు సరఫరా చేయలేక చతికిలబడిపోతోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో ఖచ్చితమైన విధానాన్ని విద్యాశాఖ అనుసరించడం లేదు. పరీక్షలు నిర్వహించడంలో ఏవిధానాన్ని అనుసరిస్తున్నారు అనే ప్రశ్నకు ఎవరూ స్పష్టంగా సమాధానం చెప్పలేక పోతు న్నారు. సీసీఈ (కంటిన్యూవస్ కాంప్రహెన్సివ్ ఇవాల్యుయేషన్) విధానాన్ని సుమారు దశాబ్దన్నర కాలం క్రితం విద్యార్థుల మూల్యాం కనానికి ప్రవేశపెట్టారు. కొద్దికాలం వరకు అన్ని పాఠశాలల్లో ఈ విధానాన్ని అనుసరించారు. ముఖ్యంగా నాలుగు ఫార్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలకు ఈ విధానాన్ని అందరూ అనుసరిస్తూ వచ్చారు. దీని ప్రకారం తరగతి గదిలో విద్యార్థులు నోటు పుస్తకాలు రాసినందుకు 10 మార్కులు, ఎస్సైన్మెంట్‌కు 10, ప్రాజెక్టు వర్క్‌కు 10, ఉపాధ్యాయుడు తన సొంతంగా తయారు చేసుకున్న ప్రశ్నపత్రానికి 20 మార్కులు కలిపి 50 మార్కులకు ఎఫ్ఏ-1, 2, 3, 4 పరీక్షలు నిర్వహించేవారు.

**వాట్సాప్ ద్వారా ప్రశ్నాపత్రాలు...**

కారణాలు ఏమైనప్పటికీ సీసీఈ విధానాన్ని నిలిపివేశారు. ఉన్నత స్థాయిలో ప్రశ్నాపత్రాలు తయారుచేసి వాటిని వాట్సప్ ద్వారా పంపిస్తున్నారు. వాట్సాప్‌లో చూసి ఈ ప్రశ్నలనే ఉపాధ్యాయులు బోర్డుపై రాస్తున్నారు. విద్యార్థులు వాటిని తమ వెంట తెచ్చుకున్న తెల్ల కాగితాలపై ఎక్కించుకుని జవాబులు రాసి ఇస్తున్నారు. హిందీ, లెక్కలు, ఇంగ్లీషు, సోషల్ వంటి సబ్జెక్టులకు ప్రశ్నాపత్రాలు పేజీల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రశ్న పత్రాలు ఎక్కించడానికి ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తుందని ఉపాధ్యాయులు అంటున్నారు. ప్రశ్నపత్రాలను ఎక్కించుకున్న తర్వాత సమాధానాలు రాసేందుకు విద్యార్థులకు సమయం సరి పోవడం లేదు. కొన్ని తరగతులకు పూటకు రెండు సబ్జె క్టులు పరీక్షలు నిర్వహించాల్సి వస్తోంది. అటువంటప్పుడు ప్రశ్నపత్రాలు ఎక్కించుకోవడానికి జవాబులు రాయడానికి సమయం చాలక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది.

ఏలూరు జిల్లావ్యాప్తంగా 1,498 ప్రాథమిక పాఠశాలలు, 366 ప్రాథమిక ఉన్నత పాఠశాలలు, 471 ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 2,335 ఉన్నాయి. మూడో తరగతిలో 24,467 మంది విద్యార్థులు, నాలుగవ తరగతిలో 29,007, ఐదో తరగతిలో 30,288, ఆరో తరగతిలో 28,857, ఏడో తరగతిలో 28,467, ఎనిమిదో తరగతిలో 27,190, తొమ్మిదో తరగతిలో 26,351, పదో తరగతిలో 24,815 మంది విద్యార్థులు కలిపి మొత్తం 2,19,442 మంది చదువుతున్నారు. ఒక్కొక్క విద్యార్థికి ఏడాదికి సుమారు రూ.25 పరీక్షల నిర్వహణకు కేటాయిస్తే సుమారు రూ.అరకోటి లోపే ఖర్చు అవుతుంది. అంటే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు రెండు లక్షల పైచిలుకు విద్యార్థులకు ప్రభుత్వం కనీసం ఏడాదికి రూ.50 లక్షలు మంజూరు చేసేందుకు సంసిద్ధంగా లేదని తెలుస్తోంది. ఇదిలా ఉంటే పాఠశాలల నిర్వహణకు గ్రాంట్లు విడుదల కాకపోవడంతో తరగతి గదిలో బోర్డుపై రాయడానికి శుద్ధ ముక్కలు, విద్యార్థులకు ఇవ్వడానికి తెల్ల కాగితాలు కూడా అందుబాటులో లేని దుస్థితి నెలకొంది. పోనీ ఐఎఫ్ పి ప్యానల్, స్మార్ట్ టీవీలలో ప్రశ్నపత్రం చూపించి విద్యార్థులతో జవాబులు రాయించడానికి వేలాది రూపాయల నెట్ బిల్లులు చెల్లించలేనిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల ఉపాధ్యాయులు సొంత డబ్బులతో ప్రశ్నపత్రాలు జిరాక్స్ తీసి, తెల్ల కాగితాలు కూడా కొనుగోలు చేసి పిల్లలకు ఇస్తున్నారు. ప్రభుత్వం నుంచి తమ పాఠశాలకు కంప్యూటర్లు, ప్రింటర్లు, ఐఎఫ్‌పి ప్యానళ్లు, స్మార్ట్ టీవీలు వచ్చాయి కానీ ఎస్ఎంఎఫ్ నిధులు ఈ ఏడాది ఇప్పటివరకు విడుదల కాలేదని ఏలూరు ప్రాంత మండలానికి చెందిన హెచ్ఎం ఒకరు చెప్పారు. ఈ కారణంగా చాక్ పీసులు, తెల్ల కాగితాలు, పాఠశాలలో మైనర్ రిపేర్లు, నెట్ బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సీసీఈ నిబంధనల ప్రకారం తరగతి గదిలో ఉపాధ్యాయులు సొంతంగా ప్రశ్నపతాన్ని తయారు చేసుకునేలా అవకాశం కల్పించాలి లేదా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ద్వారా ప్రశ్నపత్రాలను పంపిణీ చేయాలి, కనీసం పాఠశాల నిర్వహణ గ్రాంట్లు విడుదల చేస్తే విద్యార్థుల పరీక్షల నిర్వహణకు అనువుగా ఉంటుందని హెచ్ఎం అభిప్రాయపడ్డారు.

సంపాదకీయం

# ప్రతిపక్షాల శంఖనాదం

ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలోని బీజేపీని గద్దె దించడానికి ప్రతిపక్షాలన్నీ కలిసి ఏర్పాటు చేసిన "ఇండియా" ఐక్య సంఘటన చెదిరిపోయింది, విఫలమైంది అన్న వాదనలు సర్వత్రా వ్యాపించాయి. ఈ తరుణంలో ముంబైలోని శివాజీ పార్కులో ఆదివారం జరిగిన "ఇండియా" ర్యాలీ ఈ కూట వాదాలను పటాపంచలు చేసింది. "ఇండియా" పక్షాల మధ్య సీట్ల సర్దుబాటు సాధ్యం కావడం లేదు అన్న ప్రచారం గోదీ మీడియాలో జోరుగా సాగుతోంది. కానీ కీలకమైన తమిళనాడు, పంజాబ్, ఉత్తరప్రదేశ్, బీహార్, మహారాష్ట్రలో "ఇండియా" ఐక్య సంఘటన పక్షాల మధ్య సీట్ల సర్దుబాటు కుదిరింది. దక్షిణాదిలోనూ సాధ్యమైంది. రెండు విడతలుగా రాహుల్ కొనసాగించిన భారత్ జోడో యాత్ర పొడవునా జనం నుంచి కనిపించిన ఆదరణ అపూర్వమైంది. రాహుల్ గాంధీలో కూడా పరిణతి పెరిగింది. "ఇండియా" ఐక్య సంఘటన ఇంతకు ముందు తలపెట్టిన ఉమ్మడి ర్యాలీలు సాకారం అయి ఉండకపోవచ్చు. కానీ ముంబై ర్యాలీ ఓ శంఖనాదం. సహజంగానే ప్రధాన మీడియా వ్యవస్థలేవీ ముంబై ర్యాలీకి అంత ప్రాధాన్యం ఇవ్వలేదు. గోదీ మీడియా నుంచి అంతకన్నా ఆశించడమూ పొరపాటే.

మీడియా స్పందన, ప్రాధాన్యత ఎలా ఉన్నా శివాజీ పార్కు ర్యాలీ ద్వారా ప్రతిపక్షాలు తమ అస్తిత్వాన్ని, పోరాట పటిమను బలంగా చాటుకున్నాయి. ఎన్నికలకు ముందున్న పరిస్థితి ఏమిటి? ఎన్నికల తరవాత పరిస్థితి ఎలా ఉండబోతోంది అనడానికి ఈ ర్యాలీ స్పష్టమైన సంకేతం. మోదీ నాయకత్వంలోని బీజేపీని గద్దె దించాలన్న ప్రతిపక్షాల బలమైన ఆకాంక్ష ఈ ర్యాలీ ద్వారా వ్యక్తమైంది. శివాజీ పార్కు ర్యాలీకి, రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్రకు, బీహార్‌లోని వివిధ ప్రాంతాలలో ఇటీవల రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్.జె.డి.) నాయకుడు తేజస్వీ యాదవ్ నిర్వహించిన సభలకు జనం తరలి వచ్చిన తీరు మోదీ సర్కారు మీద పెరుగుతున్న వ్యతిరేకత తీవ్రత ఎంత ఎక్కువగా ఉందో స్పష్టంగా వ్యక్తమైంది. ఈ ర్యాలీలో పాల్గొన్న వివిధ ప్రతిపక్షాల నాయకులందరి నోటి నుంచి వెలువడిన ఒకే ఒక మాట "బీజేపీ భగావో దేశ్ బచావో" అని మాత్రమే. ఈ నినాదంలో ప్రస్తుతం కేంద్రంలో ఉన్న ప్రభుత్వాన్ని ఓడించాలన్న కోరిక ఎంత బలంగా ఉన్నప్పటికీ దేశాన్ని రక్షించాలన్న ఆకాంక్ష అంతకన్నా దృఢంగా ఉంది. సైద్ధాంతికంగా పొంతన లేకపోవచ్చు కానీ 1975లో పాట్నాలో లోక్‌నాయక్ జై ప్రకాశ్ నారాయణ్ నాయకత్వంలో నిర్వహించిన బ్రహ్మాండమైన భారీ ర్యాలీకి, శివాజీ పార్కులో ఆదివారం జరిగిన ర్యాలీకి పోలికలు కనిపిస్తున్నాయి. అప్పుడు "సింహాసనం ఖాళీ చేయండి, జనం దిల్లీ వైపు సాగుతున్నారు" అన్న నినాదం వినిపిస్తే ఇప్పుడు బీజేపీని ఓడించాలన్న బలమైన ఆకాంక్ష జనంలోనే కనిపిస్తోంది. శివాజీ పార్కు ర్యాలీ జరిగిన తీరు, ప్రతిపక్షాల ఐక్యతను గమనిస్తే మోదీని గద్దె దించడం మాత్రమే ప్రతిపక్షాల ఉద్దేశం కాదని అర్థం అవుతోంది. ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా ప్రతిపక్షాల యాత్ర ఆగకూడదని తేజస్వీ యాదవ్ చెప్పడానికి కారణం ఇదే. ఈ లక్ష్యం నెరవేరాలంటే ప్రతిపక్షాల నాయకులు జనంతో మిళితం కావాల్సిందే. ఈ సభ జరిగిన వైనం చూస్తే మోదీ పాలనతో విసిగిపోయిన ప్రజల వైఖరి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. జనం ఆకాంక్షలను కార్యరూపంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ఇప్పుడు ప్రతిపక్ష పార్టీల మీదే ఉంది.

ఈ ర్యాలీకి "ఇండియా"ఐక్య సంఘటనలోని ప్రధానమైన నాయకులందరూ హాజరయ్యారు. రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు, "ఇండియా"కూటమి సారథి మల్లికార్జున్ ఖర్గే, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్.సి.పి.) అధినేత శరద్ పవార్, శివసేన ఉద్ధవ్ వర్గం నాయకుడు ఉద్ధవ్ ఠాక్రే, తమిళనాడు ముఖ్యమంత్రి, డి.ఎం.కె. అధినేత ఎం.కె. స్టాలిన్, నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఫరూఖ్ అబ్దుల్లా, ఆర్.జె.డి. నాయకుడు తేజస్వీ యాదవ్, పి.డి.పి. నాయకురాలు మహబూబా ముఫ్తి లాంటి వారు హాజరయ్యారు. సమాజ్ వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ హాజరు కాకపోయినా ర్యాలీ విజయవంతం కావాలని సందేశం పంపించారు. కొట్టొచ్చినట్టు కనిపించిందల్లా బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ రాకపోవడమే. దీనికి కారణం లేకపోలేదు. ఇటీవల ఆమె స్వల్ప అనారోగ్యానికి గురి అయిన మాట నిజమే అయినా అది ఆమె రాకకు అవాంతరం అనుకోవడానికి వీలు లేదు. బెంగాల్‌లో సీట్ల పంపిణీ విషయంలో మమతా బెనర్జీ అనుసరించిన వైఖరి ఆమె ఒంటెత్తు పోకడకు తార్కాణం. అందువల్ల ఆమె "ఇండియా"ఐక్య సంఘటన నాయకులకు ముఖం చూపించడానికి మొహమాట పడడం సహజమే. ఒక వేళ ప్రతిపక్ష ఐక్యత గురించి ఆమెకు పట్టింపే ఉంటే తమ పార్టీ తరఫున ఓ ప్రతినిధిని అయినా పంపించే వారు. కానీ మమతా బెనర్జీ చూపు బెంగాల్ దాటి పోవడం లేదు. "ఇస్ బార్ చార్ సౌ కె పార్" అని మోదీ ఎంత అరిచి గీపెట్టినా అంతటి విజయం దక్కుతుందన్న ఆశ లేదు. ఎన్నికల బాండ్ల వ్యవహారంలో మోదీ పరువే కాదు బీజేపీ పరువూ పోయింది. అందుకే బీజేపీ నాయకులందరూ ఈ విషయంలో నోరు విప్పే స్థితిలో లేరు. ప్రతిపక్షాలన్నీ అవినీతిలో కూరుకుపోయినవేనని మోదీ రొడ్డ కొట్టుడుగా ఉపన్యాసాలతో హోరెత్తిస్తున్నా ఫలితం ఉండేట్టులేదు. దక్షిణాదిలో 2019లో కర్నాటక నుంచి బీజేపీకి గణనీయమైన సీట్లు దక్కిన మాటనిజమే. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితిలేదు. అక్కడ 28స్థానాలున్నాయి. కేరళలోఉన్నవి 20స్థానాలే అయినా, ఆ రాష్ట్రంలో "ఇండియా" ఐక్య సంఘటనలోని కాంగ్రెస్‌కు, వామపక్షాలకు మధ్య పోటీ అనివార్యమైనా బీజేపీకి ఒరిగే ప్రయోజనం ఏమీ ఉండదు. దక్షిణాదిలోని మొత్తం 132 సీట్లలో బీజేపీ ఎంత ఉబలాట పడ్డా నిరాశే మిగలక తప్పదు. ఉత్తరాదిలో బీజేపీకి ఇప్పటికే అధిక స్థానాలు ఉన్నాయి. అదనంగా దక్కడానికి సీట్లే లేవు. అందువల్ల "చార్ సౌ పార్" అన్నది మోదీ ఆత్మ సంతృప్తికి పరిమితం కాక తప్పదు. తమిళనాడు, ఉత్తరప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర, పంజాబ్‌తోపాటు దక్షిణాదిలో "ఇండియా" ఐక్య సంఘటన సీట్ల సర్దుబాటు పూర్తి అయింది.

శివాజీ పార్క్ సభలో మల్లికార్జున్ ఖర్గే రాహుల్ గాంధీ తరవాత మాట్లాడినా జనం కదలలేదు. ఆయన మరాఠీలో అద్భుతంగా మాట్లాడి ఆకట్టుకున్నారు. ఇ.వి.ఎం.లు లేకపోతే మోదీ గెలవలేరని రాహుల్ అంటే ఈ విషయంలో ఎన్నికల కమిషన్‌ను బోనులో నిలబెట్టాల్సిందేనని ప్రకాశ్ అంబేద్కర్ అన్నారు. ఇ.వి.ఎం.లమీద ఉన్న అనుమానాలను ఎన్నికల కమిషన్ ఇప్పటికి తీర్చలేదు. ఈ విషయంపై ప్రతిపక్షపార్టీలతో మాట్లాడడానికి ఎన్నికలకమిషన్ విముఖంగాఉండడంవల్ల ఎన్నికలు నిష్పక్ష పాతంగా జరగవేమోనన్న అనుమానాలను పెరుగుతున్నాయి. అంతిమ అస్త్రం జనందగ్గరే ఉంది. మోదీని జనమే గద్దెదించడం ఖాయంగా కనిపిస్తోంది.

# శేష ప్రశ్నలకు ఏం సమాధానం చెబుతారు

చవెరా, 9392711999

"ఏరు దాటేదాకా ఓడ మల్లన్న ఏరుదాటిన తరువాత బోడి మల్లన్న" అనేది ఒక తెలుగు సామెత. అంటే అవసరం తీరేవరకు ఒక రకమైన మర్యాద, అవసరం తీరిన తరువాత మరో రకమైన మర్యాద. ఇది అక్షరాలా ప్రస్తుతం దేశాన్ని పరిపాలిస్తున్న నరేంద్ర మోదీ, బీజేపీకి వర్తిసుంది. 2019 ఎన్నికల తర్వాత ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాలపట్ల బీజేపీ అనుసరించిన వైఖరికి ఈ సామెత సరిపోతుంది. గతంలో తమతో ఉండి కూటమి నుంచి బైటకు వెళ్లిపోయిన జేడీయూ, జేడీఎస్, అకాలీదళ్, తెలుగుదేశం, బీజేడీ వంటి పార్టీలను ఇప్పుడు తరిగి సార్వత్రిక ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో తమకు దేశంలో ఎదురుగాలి వీస్తున్నదని గ్రహించి ఇప్పుడు దూరమైన పార్టీలను నయానో,భయానో తిరిగి తమ దారికి తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాలు రెండు పోటీపడి అన్ని విషయాలలో బీజేపీ అడుగులకు మడుగులొత్తాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న జగన్ తన మీద ఉన్న ఆర్థికనేరాల కారణంగా, తమ వ్యక్తిగత అవసరాల నిమిత్తం మోదీ, అమిత్ షా అడుగులకు మడుగులెత్తారు. ఢిల్లీలో వర్షం వస్తే విజయవాడలో గొడుగులు పట్టారు. మోదీ, అమిత్‌షా ద్వయం కూడా జగన్ అక్రమాలను, అవినీతిని, అసాంఘిక పాలనను ఐదేళ్లుగా అనుమతిస్తూ వచ్చారు. ఇప్పుడు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఒక్కసారిగా జగన్‌ను పక్కనపెట్టి ప్రతిపక్షనాయకుడు చంద్రబాబును బుజ్జగించి తమ పక్కన చేర్చుకున్నారు. చర్చలకు రావల్సిందిగా అమిత్‌షా పిలిచిందే తడవుగా చంద్రబాబు ఢిల్లీ వెళ్లటం, చర్చలు జరపటం, ఎన్‌డీఏ కూటమిలో చేరటానికి అంగీకరించటమే కాకుండా బీజేపీ బలానికి మించి పార్లమెంటు స్థానాలు ఇవ్వటానికి ఒప్పందం చేసేసుకున్నారు. గత ఐదేళ్లుగా జగన్ ప్రభుత్వానికి అండగా ఉన్న బీజేపీ, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని విచ్ఛిన్నం చేయటానికి జగన్ ప్రభుత్వం చేసిన కుట్రలు, కుతంత్రాలకు పరోక్షంగా పూర్తి మద్దతును అందించింది. దీని పరాకాష్టగా చంద్రబాబును అక్రమకేసులో ఇరికించి 52రోజులపాటు జైలులో నిర్బంధించటం వెనుక బీజేపీ కేంద్రనాయకత్వం పాత్ర జగమంతా ఎరిగినదే. ఇప్పుడు రాష్ట్రంలో జగన్ వ్యతిరేక పవనాలు ఉధృతం కావటంతో ఎక్కడ తమ ప్రాపకం దెబ్బతింటుందోనని తెలుగుదేశం పార్టీని బీజేపీ దగ్గరికి తీసుకున్నది. తెలుగుదేశం పార్టీలో అత్యధికులు బీజేపీతో కలిసి వెళ్లటాన్ని వ్యతిరేకిస్తున్నప్పటికి చంద్రబాబు రాజకీయంగా బీజేపీని ఎదుర్కొనే ధైర్యం లేక వారితో రాజీపడి వారి బలానికి మించిన సీట్లుఇచ్చి ఎన్‌డీఏ కూటమిలో భాగస్వామిగా చేరాడు.

ఇప్పుడు చంద్రబాబు నాయుడు బీజేపీతో పొత్తును సమర్థించుకునే క్రమంలో కొత్తపల్లవిని ఎత్తుకున్నాడు. "తాటి చెట్టు ఎందుకు ఎక్కావంటే దూడ మేతకు" అన్నట్లు రాష్ట్రం పునర్నిర్మాణం కోసం, రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకోసం బీజేపీతో కలిశానని సమర్థించుకుంటున్నారు. 2014 నుంచి 2019 వరకు రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నకాలంలో కేంద్రప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నప్పటికీ రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ ఏ మాత్రం సహకరించకపోగా అనేక ఇబ్బందులు కల్పించి 2018లో




తెలుగుదేశం ఎన్‌డీఏ కూటమి నుంచి బైటకు వచ్చే పరిస్థితులు కల్పించింది. ఈ విషయం చంద్రబాబు విస్మరించినా రాష్ట్ర ప్రజలు ఇంకా మర్చిపోలేదు. వైసీపీ అరాచకపాలన వల్ల ప్రజలు భయంలో బ్రతుకుతున్నారని, జగన్ మళ్లీ వస్తే రాష్ట్రానికి అప్పు పుట్టదని, రాష్ట్ర వనరులన్నీ తాకట్టు పాలయ్యాయని, ప్రభుత్వ పథకాల అమలు దుర్భరం కానున్నందున, ఈ పరిస్థితి నుంచి బైటపడేందుకు బీజేపీ పంచన చేరాల్సి వచ్చిందని సమర్థించుకుంటున్నారు. రాష్ట్రంలో సంపదను సృష్టించి ఆదాయం పెంచుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని అందుకు కేంద్రం సహకారం తప్పనిసరి అని చెబుతున్నారు. ప్రజాస్వామ్యం పదికాలాలపాటు నిలబడాలంటే పొత్తులు తప్పదని చంద్రబాబు శెలవిచ్చారు. రాష్ట్రాభివృద్ధి కోసమే గతంలో బీజేపీతో పోరాడానని, ఇప్పుడు రాష్ట్ర పునర్నిర్మాణం కోసం బీజేపీతో కలుస్తున్నానని బాబు చెబుతున్నారు. అంతేకాకుండా పది ఏళ్ల మోదీ పాలనకు కితాబు ఇస్తూ మోదీ ఎజండా దేశాన్ని సర్వతోముఖాభివృద్ధి చేయటమేనని, అందుకు అంతర్జాతీయంగా భారతదేశ అభివృద్ధి గురించి మోదీ మాట్లాడుతున్నారని, మా ఇద్దరి దృష్టి రాష్ట్ర-దేశ అభివృద్ధి గురించేనని, జగన్‌కు అభివృద్ధి అంటే తెలియదని పేర్కొన్నారు. దేశం రాష్ట్రం డబల్ ఇంజిన్ సర్కారులా పనిచేయాలని చెప్పారు.

దేశ ప్రగతి, ఆంధ్రరాష్ట్ర అభివృద్ధి, ప్రజల అభ్యున్నతికోసం మోదీ ఉత్తేజకరమైన, దూరదృష్టిగల నాయకత్వంలో సాధ్యమని చంద్రబాబు పది ఏళ్ల తర్వాత గ్రహించగలిగారు. చంద్రబాబు మాటలు తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఢిల్లీ పెద్దల వద్ద తాకట్టు పెట్టినట్లుగా ఉన్నాయి. బీజేపీ-తెలుగుదేశం-జనసేన అవకాశవాద కలయిక, సిద్ధాంతాలులేని అభివృద్ధికి హామీలేని కలయిక కొత్త శకాన్ని సృష్టించకపోగా ఆంధ్రుల ఆత్మ గౌరవాన్ని మంటగలిపేదిగా, రాష్ట్రానికి భవిష్యత్తు లేకుండా చేస్తుందని విజ్ఞులైన అనేకులు అభిప్రాయపడుతున్నారు. బీజేపీ మతోన్మాద, నియంతృత్వ విధానాలకు టీడీపీ వత్తాసుపలకటం వారి లౌకిక విధానానికి తీరని ద్రోహం చేయటమేనని చాలామంది భావిస్తున్నారు. ఈ కలయిక వలన రాష్ట్రంలో మైనారిటీ, దళిత, గిరిజనుల, మహిళల జీవితాలు ప్రమాదంలో పడుతున్నాయని వారు వాపోతున్నారు. తెలుగువారు ఆత్మగౌరవాన్ని కోల్పోవటంతోపాటు దేశ ఫెడరల్ స్ఫూర్తికి, సెక్యులరిజానికి చెల్లుచీటి ఇచ్చినట్లుగా చంద్రబాబు వైఖరి ఉందని అనేకులు పేర్కొంటున్నారు.

నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెంబుడు నీళ్లు, పిడికెడు మట్టి ఇచ్చి నరేంద్ర మోదీ అవమానించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న 5ఏళ్ల కాలంలో, తర్వాత రాష్ట్ర అభివృద్ధికి ఎటువంటి సహాయం అందించదని మోదీ ఇప్పుడు ఎలా అభివృద్ధి కాముకుడు అవుతాడో తెలుగుదేశం పార్టీ, ఆ పార్టీ నాయకుడు చంద్రబాబు చెప్పాలి. 2018లో మార్చి 16న బీజేపీతో తెగతెంపులు చేసుకున్న పాపానికి చెంపలు వేసుకున్న చంద్రబాబు ఇప్పుడు మోదీ విధానాలలో ఏమి మార్పు గ్రహించారో ప్రజలకు చెప్పాల్సి ఉంది. ఆనాడు రాష్ట్ర అసెంబ్లీలో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఒక తీర్మానం ఆమోదించారు. అన్యాయాలపై 7శ్వేతపత్రాలు వెలువరించారు. రాష్ట్రానికి సంబంధించిన వాగ్దానాలలో ఏ ఒక్కటి నెరవేర్చని నరేంద్ర మోదీ నేడు ఆంధ్రుల అభివృద్ధి కాముకుడిగా ఎలా మారాడో చంద్రబాబు తెలుగు ప్రజలకు చెప్పాలి. రాష్ట్రంలోని ఏకైక భారీ పరిశ్రమ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఒక పక్కన నరేంద్రమోదీ ప్రభుత్వం తెగ నమ్ముతుంటే వారికి మోదీ పాలనలో ప్రగతి కన్పించటం ఆశ్చర్యంగా ఉంది. ఒక శాతం కూడా ఓట్లులేని బీజేపీని రాష్ట్రంలోకి తీసుకువచ్చి వారికి ఎక్కువ సీట్లు కేటాయించి నెత్తిమీద నిప్పుల కుంపటి పెట్టుకుంటున్న చంద్రబాబు చర్యలను తెలుగుదేశం శ్రేణులు సైతం అర్థం చేసుకోలేకుండా ఉన్నాయి. ఒకప్పుడు కేంద్ర పాలకుల నిరంకుశ విధానాల మీద ధ్వజమెత్తి యావత్ ప్రతిపక్షాన్ని ఒక్కటిచేసి పోరాడి, ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని దశదిశల చాటిచెప్పిన ఎన్‌టీఆర్ వారసులు నేడు కేంద్రానికి దాసోహం అనటాన్ని ప్రజలు జీర్ణించుకోలేకున్నారు.

"పాము తన పిల్లలను తానే మింగివేసినట్లు" తనతో పొత్తుపెట్టుకున్న పార్టీలను విచ్ఛిన్నం చేసి తాను బలపడటం బీజేపీ నైజం. గత 5ఏళ్లుగా ప్రతిపక్షంలో ఉన్నచంద్రబాబు నాయుడు రాష్ట్రానికి బీజేపీ చేసిన అన్యాయాన్ని ఏనాడు విమర్శించలేదు. రాష్ట్రంలో అధికారపక్షంతో పోటీపడి మరీ కేంద్రంలో అనేక అంశాలలో బీజేపీకి మద్దతు ఇచ్చారు. తొలి నుంచి అవకాశవాద రాజకీయాలను అనుసరించారు. కేంద్ర ప్రభుత్వం గత 5ఏళ్లుగా అధికారంలో ఉన్న జగన్‌కు ప్రత్యక్ష మద్దతును ఇచ్చి రాష్ట్రం అధోగతి పాలుకావటంతో "తిలాపాపం తలాపిడికెడు" అన్నట్లు వ్యవహరించింది. మరి ఇప్పుడు కేంద్రంలోని ప్రభుత్వంలో ఏమి మార్పు వచ్చింది. చంద్రబాబుకు బీజేపీ నాయకులు ఏమి హామీ ఇచ్చారు. రాష్ట్ర అభివృద్ధికి ఏమి ప్రణాళికలు ఆమోదించారో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ఉంది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పిస్తారా? విభజన హామీల పట్ల బీజేపీ వైఖరి ఏమిటి? రాజధాని అమరావతిని సమర్థిస్తారా? రాష్ట్రాన్ని ఆర్థికంగా ఎలా పటిష్టం చేస్తారు? మన విజయవాడ, విశాఖ మెట్రోల పరిస్థితి ఏమిటి? కాకినాడ పెట్రో కెమికల్ ప్రాజెక్టుల మాట ఏమిటి? మత సామరస్యానికి హామీ ఏమిటి? పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల తగ్గింపు మాట ఏమిటి? రాష్ట్రాన్ని ఆర్థికంగా ఎలా ముందుకు తెస్తారు? పోలవరం ఎప్పటికి పూర్తి చేస్తారు? ఇలా ఎన్నో శేష ప్రశ్నలు. వాటన్నింటికి చంద్రబాబు ఏమి సమాధానం చెబుతారు. సమాధానం లేని ప్రశ్నలతో ప్రజలను మోసగించకండి.

# అటూ...ఇటూ...

చింతపట్ల సుదర్శన్

# రంగస్థలం

ఇవ్వాళటి న్యూస్ పేపరు మనకు ఎల్లాగూ దొరకదు. అదృష్టం కలిసొచ్చి ఎవడో పారేసుకున్నది నిన్నటిది దొరికింది. అయితేనేం అన్నీ బ్రేకింగ్ న్యూస్‌లూ షాకింగ్ న్యూస్‌లా ఉన్నట్టున్నయి 'టేస్టు' అదిరంది అనుకుంది డాంకీ మధ్యాహ్నం లంచ్ చేస్తూ. ఇంక చాలు ఇవాల్టికి అని ఇంటిదారి పట్టిన డాంకీ తను తిన్న పేపర్లు అంత రుచిగా ఉండటానికి కారణం ఎలెక్షన్ షెడ్యూలే ననుకుంది. ఇక రాబోయేరోజుల్లో పేపర్లు మరింత నిండుగా, మరింత రంజుగా, మజాగా ఉంటయి అనుకుంటున్న డాంకీ ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

రోడ్డు మీద వీధికుక్కల గుంపు తన పెద్ద చెవులు కూడా చిల్లు పడేట్టు అరుస్తున్నవి. రోడ్డుకు ఓ పక్క నిలబడి చోద్యం చూసింది. మనిషైతేనేం గాడిదైతేనేం కూసింత కళాపోషణ, కాసింత ఎంటర్ టైన్‌మెంటూ కొంచెం థ్రిల్లూ ఉండాలికదా మరి అంటూ. చౌరస్తాకు ఇటువక్క నుంచి కుక్కల గుంపు అరుస్తూ చౌరస్తాలో ఉన్న గొప్పోడి విగ్రహం దాకా పరుగెత్తి ఆగి నిలబడి ముఖాలు పైకెత్తి నిలబడితే, విగ్రహానికి మరోవక్క ఉన్న గుంపు అరుచు కుంటూ వెనక్కి పరుగెట్టింది. అలా వెనక్కి వెళ్లిన గుంపు తిరిగి అరుచుకుంటూ పరుగెత్తుకు రావడంతో ఈ పక్క కుక్కలు వెనక్కి పరుగెత్తుకు వచ్చినయి. ఇలాగ ఇవి ముందుకు వెళ్తే అవి వెనక్కి ముందుకు వస్తే ఈ పక్కవి వెనక్కి రావడం చూస్తుంటే భలేగా ఉంది డాంకీకి. ఇటునుంచి అరుపులే అటునుంచి అరుపులే. అరుపులే ప్రశ్నలు, అరుపులే జవాబులుగా ఉన్నయి. అనలీ 'యాక్షన్' లేని అరుపుల పరంపర ఎందుకోననుకుంటున్న డాంకీకి ఈ వక్క గుంపులో అన్నింటి కంటే 'పెద్ద సౌండు' చేస్తున్న డాగీ కనిపించింది. ఓహో తమ్ముడు కూడా ఉన్నాడే. అరిచి అరిచి అలసిపోయి అరుగు మీదకి వస్తాడు కదా విషయం పూర్తిగా వివరిస్తాడు కదా అనుకుని కూలిన కొంప వైపు నడిచింది డాంకీ.

అరుగు మీద 'రెస్టు' తీసుకుంటున్న డాంకీకి, అలసిపోయి కుయికుయిమని మూలుగుతూ అరుగు ఎక్కిన డాగీ కనిపించింది. ఏంటి బ్రో అరచి అరచి అలసిపోయినట్టున్నావు అంది డాంకీ. అవును బ్రో. బజార్లో పెద్ద యుద్ధమే జరిగింది అంది డాగీ కాళ్లు చాపుకు కూచుంటూ. యుద్ధమా? యుద్ధమెక్కడ జరిగింది? మొరిగే నోళ్లు తప్ప, కరిచే నోళ్లు కనపడ్లేదే. దాన్ని యుద్ధమంటారా 'నోటి దూల' అంటారుగాని అంది డాంకీ. అంటే నువ్వంతా చూసేశావన్న మాట. 'ఫ్రీ' షో చూడకుండా ఉంటానా! అంది డాంకీ. చూశావన్న మాట. అరిచి అరిచి దవడలు నెప్పెట్టాయి కానీ ఆ సైడు వాటికంటే మేమే గొప్పగాఅరిచాంకదా అంది డాగీ. అరవడం కూడా గొప్పేనా. ఎలెక్షన్ సీజన్‌లో మన నాయకులంతా చేసే పని అదే గదా. అసలింతకీ గొడవ దేనికో అంది డాంకీ. ఏముందిలే మా గుంపు ఆత్మగౌరవానికి సంబంధించిన విషయం. మా వాళ్లల్లో ఒకడిని ఆ వైపు గుంపులో చేర్చుకున్నారు. అది అన్యాయం కదా! అవునా. మరి వో వారం కిందట ఆ గుంపులోని వీధికుక్క మీ గుంపులో చేరిందన్నావు అంది డాంకీ. అదా! అది దానిష్టం. మా గుంపులో చేరాలని తనే ఇష్టపడి వచ్చింది. ఏంకాదు ఇక్కడ మీరు నిలబడే మాంసంకొట్టు వాడు ఎక్కువ ఎముకలు విసిరేస్తాడని వచ్చి ఉంటుంది అంది డాంకీ పళ్లుబయటపెడ్తూ. కుక్కలయితేనేం మనుషులైతేనేం ఎక్కడ 'లాభం' ఉంటుందో అక్కడికి పోవడం తప్పుకాదే. గ్రూపు మార్చిడి నేరం కాదే. పదవుల కోసం ఆశపడే కదా మనుషులు పార్టీలు మారుస్తారు. టిక్కెట్ల కోసమే కదా ప్రజా సేవకులు కండువాలు మార్చుకుంటారు. ఏ వైపు ఎక్కువ తిండి దొరికే ఛాన్సుందో ఆ వైపుకుకుక్కలు మారడం మామూలే. ఏవైపు పదవి ఉండునో ఆ వైపు గోడదూకడం మనుషులకూ మామూలే అంది డాగీ.

నీ తులనాత్మక అధ్యయనం వినడానికి ఆసక్తికరంగానే ఉంది. కానీ ఓ కవి ఏమన్నాడు. 'అరిచే కుక్కలు కరవవు. కరిచే కుక్కలు అరవవు. అరవని కరవని కుక్కలు ఎక్కడా ఉండవు అని కదా. ఎంతసేపూ ఈ వక్కా ఆ వక్కా కుక్కలు అరుచుకోవడమేనా... కరుచుకోవడమే లేదా? ఒట్టి కూతల సంతర్పణేనా? అంది డాంకీ. ఆ పక్క గ్రామ సింహాలు అరిస్తే ఈ పక్క వాళ్లమూ అరుస్తాం. వాళ్లు కరిస్తేనే కదా మేమూ కరిచేది. వాళ్లు మా కనుగుడ్లు పీకి చేతికాస్తిమన్నారు. మేం వాళ్లను తొక్కి నారతీసి పేగులు మెడలో వేసుకుంటాం అన్నాం. గొయ్యి తీసి పాతిపెడ్తామని మరో 'ఎక్స్‌ట్రా' తిట్టూ తిట్టాం. వాళ్లు మా కళ్ల జోలికి వచ్చి ఉంటే మేం వాళ్ల ప్రేవులు మెళ్లో వేసుకునే వాళ్లమే...అని అబ్బాయి అరుగు ఎక్కుతుండటంతో ఆపేసిందా డాగీ.

అరుగు ఎక్కిన అబ్బాయి అన్నాడు ఊళ్లో కుక్కల గోల ఎక్కువైందని, గ్రూపులు కట్టి గ్రూపులు మార్చి నోటికి వచ్చినట్టు కూస్తున్నారని అనుకుంటున్నారు జనం. కోటి అరుపులు కూటి కొరకే అన్నా. నాయకుల ధర్నాలు, రోడ్డు షోలు, బలవంతపు మీటింగులూ దేని కోసం అన్నా అంది డాగీ. అంటే ఏమిటి దానర్థం మీరూ మనుషులూ ఒకటేనా? వాళ్లు అరుచుకుంటారు, తిట్టుకుంటారు పార్టీలు మార్చుకుంటారు అది వాళ్ల హక్కు! వాళ్లేం చేసినా ప్రజాస్వామ్యం బాగు కోసమే, దాన్ని పదికాలాల పాటు బతికించడం కోసమే కదా అన్నాడబ్బాయి.

రా...కదలిరా...అంటారు, యుద్ధానికి సిద్ధం అంటారు. ఓట్లు వేసే వాళ్ల కోసం ఎన్ని వేషాలైనా వేస్తారు, ఎన్ని హామీలైనా ఇస్తారు అంది డాంకీ.

మేం అరిస్తే మొరిగామంటారు. వాళ్లరిస్తే ఏమీ అనరా అంది డాగీ తలదించుకుని.

# డబ్బు, కండ బలంలేని ఎన్నికలా?

కల్యాణి శంకర్

డబ్బు, కండబలం, తప్పుడు సమాచారం ప్రచారం చేయడం, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ-ఎన్నికల నియమావళి) ఉల్లంఘనలేని ఎన్నికలు జరిగిన సందర్భాలున్నాయా? ఎన్నికల్లో ఇవి పెద్ద సమస్యగా గుర్తించామని ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ చెప్పారు. 18 వ లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తూ, ఏప్రిల్ 19 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందని వెల్లడించారు. 2014 లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ నరేంద్రమోదీ రాజకీయాల్లో నేరాలను పూర్తిగా అరికడతాననీ, నల్లధనాన్ని లేకుండా చేస్తానని ఇలా దాదాపు వంద, రెండు వందల వాగ్దానాలు చేశారు. మోదీ గ్యారంటీ అంటూ ఇప్పుడు కొత్త నినాదాన్ని సృష్టించి ప్రచారం చేస్తున్నారు. ఆనాడు ఇచ్చిన గ్యారంటీలు ఏమయ్యాయో తెలియదు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్న ఉన్నత స్థాయి పాలకులను ఎన్నికల కమిషన్ ఏమీ ముట్టుకోవడంలేదు. రాజకీయాలు నేరమయమయ్యాయి. నల్లధనం విచ్చలవిడిగా పెరిగింది. అయితే ఇక్కడ ప్రశ్న ఏమిటంటే ఎన్నికల నియమావళి ఉల్లంఘనను నిరోధించటం సాధ్యమేనా! ఉన్నత స్థాయి పాలకులే నియమావళిని ఉల్లంఘిస్తున్నప్పుడు ఎన్నికల్లో పోటీచేసే ఇతరులు మౌనంగా ఎందుకుంటారు? అలాగే డబ్బు బలం, కండ బలం, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయటం ఎన్నికల నియమావళి ఉల్లంఘన లాంటివి దేశ వ్యాప్తంగా మిక్కుటమయ్యాయి. ప్రజాస్వామ్య సంస్కరణలు ఎన్నికల నిఘా సంస్థ కలిసి ప్రధానమైన రాజకీయ పార్టీలు ఉదాహరణకి బీజేపీ, కాంగ్రెస్, టీఎంసీ, ఎన్‌సీపీ, ఆర్జేడీ, ఆప్, వైసీపీ తదితర పార్టీలు అత్యధికంగా నేరస్థులనే ఎన్నికల్లో పోటీ చేయిస్తున్నాయి. ప్రస్తుత ఎంపీలు 29వేల 251 వేల కోట్ల రూపాయలు ఆస్తులు కలిగిఉన్నారు. ఇది కూడా అధికారిక గణాంకమే. అనధికారికంగా ఇంతకు మించి ఉండవచ్చు. అలాగే 44 శాతం కేంద్ర మంత్రులపై నేరపూరిత కేసులు నమోదయి ఉన్నాయి. ఇక 25 శాతం ఎంపీలపై తీవ్రమైన నేరాల కేసులు నమోదయి ఉన్నాయి. మొత్తం ఎంపీలలో 53 మంది బిలియనీర్లు, 475 మంది వేలకోట్ల రూపాయల ఆస్తులు కలిగి ఉన్నారు.

రోజురోజుకి డబ్బు, కండ బలం భారత ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు కలిగిస్తున్నది. ఈ పరిస్థితి బీజేపీ అధికారానికివచ్చిన తర్వాత మరింతపెరిగింది. ఎన్నికల్లోను ఇతర విధాలుగాను రాజకీయ నాయకులు తమ పనులు నెరవేర్చుకునేందుకు కండ బలాన్ని ఉపయోగించే నేరస్థులను పోషిస్తుంటారు. 1980 ల నుంచి నేరస్థులు రాజకీయ నాయకులుగా, పాలకులుగా అవతారమెత్తారు. రాజకీయ పార్టీలు రౌడీలను, గూండాలను, నేరస్థులను ఎన్నికల్లో ప్రయోగించడం ద్వారా ఓట్లు పొందగలుగుతున్నారు. ఎందుకంటే గూండాలు మూలంగా ఓటర్లు భయపడి ఆయా పార్టీలకు ఓట్లు వేస్తున్నారు. నేరస్థులకు, రాజకీయ పార్టీలకు మధ్య అక్రమ బంధం విస్తరిస్తోంది. ఈ పరిణామం ఇప్పుడే అంతరించే పరిస్థితి లేదు. నేరస్థులకు, పార్టీలకు మధ్య ఉన్న సంబంధం మూలంగా ఎన్నికలు ఆర్థికంగా మరింత ఖరీదైపోయాయి. ఓటర్లకు బహుమతులు పంచి, కులాలను, మతాలను విడదీసి ప్రయోజనం పొందుతున్నారు. ఆర్థిక వనరులను సేకరించి, ఓట్లు కొనుగోలు చేస్తున్నారు. 2003 నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు నేరస్థ కేసులు, ఆర్థిక పరిస్థితి, వివాహ హోదా, ఆర్థిక వనరులు ఆదాయం, సంపద, విద్యను తెలియజేస్తూ తప్పనిసరిగా అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీనే తన విద్యాస్థాయిని తెలియజేయలేదని దేశ వ్యాప్తంగా ప్రచారమయ్యింది.

ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాల నియమాలను ఎన్నికల కమిషన్ మార్పు చేసింది. నగదు రూపంలో ఇచ్చే విరాళాల మొత్తాన్ని 20వేల నుంచి రెండు వేలకు ఎన్నికల కమిషన్ తగ్గించింది. వీటి స్థానంలో ఎన్నికల బాండ్లను ప్రవేశపెట్టి అవినీతిని చట్టబద్ధం చేశారు. అయితే వ్యక్తులు ఆయా కంపెనీలు కొంత మొత్తం మేరకు రాజకీయ పార్టీలకు విరాళాలను అందించవచ్చు. అందించే ఈ మొత్తాల వివరాలను ఎవరికీ వెల్లడించవలసిన అవసరం లేదు. పారదర్శకతను పెంపొందించేందుకు నగదు రూపంలో చెల్లించే విరాళాల సంఖ్యపైన ఎలాంటి పరిమితిని విధించలేదు. ప్రతిపక్షాలు, విజ్ఞులైన ప్రముఖులు వ్యతిరేకించినప్పటికీ మోదీ ప్రభుత్వం 2017లో ఎన్నికల బాండ్లను ప్రవేశపెట్టింది. అయితే ఈ బాండ్ల కొనుగోలుదారులను గుప్తంగానే ఉంచింది.

బాండ్ల ద్వారా బీజేపీ అపారంగా ప్రయోజనం పొందింది. వీటిని రద్దు చేయాలని అనేక పిటీషన్లు రాగా వాటిని విచారించి సుప్రీంకోర్టు ఈ సంవత్సరం బాండ్ల విక్రయాన్ని నిషేధించింది. వ్యక్తులు లేదా కంపెనీలు వెయ్యి రూపాయల నుంచి కోటి రూపాయల విలువ వరకు కొనుగోలు చేయడానికి ఈ వ్యవస్థను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. గత 5 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆరువేల నూటఇరవై ఎనిమిది కోట్ల రూపాయల బాండ్లు విక్రమయ్యాయి. పారదర్శకత, జవాబుదారీతనంలేదు. ఎన్నికలబాండ్ల ద్వారా ప్రధానపార్టీలకు విరాళాలు లభించి నప్పటికీ అన్ని పార్టీల కంటె బీజేపీకి అత్యధికంగా డబ్బు చేరింది. ఎన్నికల్లో ఈ డబ్బును ఉపయోగించి బీజేపీ ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వాలను ఏర్పాటు చేసిందని విశ్లేషకులు తెలిపారు. ఫలితంగా ఇటీవల పారదర్శకత లేని ఎన్నికల బాండ్లను సుప్రీంకోర్టు నిషేధించింది. ఐదు దఫాలుగా అసెంబ్లీ ఎన్నికలు జరిగే సందర్భాలలో 17 వందల 60 కోట్ల విలువచేసే మత్తుమందులు, నగదు, మద్యంను ఎన్నికల అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

బ్యాంకులకు చెందిన వాహనాలలో పొద్దుగుంకిన తర్వాత నగదు రవాణా చేయడాన్ని ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ 2024ఎన్నికలలో నిషేధించారు. నగదు, మద్యం రవాణా చేసేందుకు ఉపయోగించే షెడ్యూల్డు కాని చార్టెడ్ విమానాల పైన కమిషన్ నిఘా పెడుతోంది. నిరక్షరాస్యత, పేదరికం తదితర అనేక సమస్యలతో దేశం సతమతమవుతున్నప్పటికీ 75 ఏళ్ల ప్రజాస్వామ్య వ్యవస్థ ముందుకు సాగుతూనే ఉంది. ఇటీవల కాలంలో ప్రజాస్వామ్మ వ్యవస్థ వేగంగా దిగజారిపోతున్నదని అనేక సంస్థల అధ్యయనాలు వెల్లడించాయి. 17 సార్లు లోక్‌సభ ఎన్నికలు జరిగాయి .అలాగే నాలుగువందల సార్లకు పైగా అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 16 సార్లు రాష్ట్రపతి ఎన్నికలు జరిగాయి. గోస్వామి, ఓబ్రా, ఇంద్రజిత్‌గుప్తా కమిటీలు, లా కమిషన్, రాజ్యాంగ సమీక్ష జాతీయ కమిషన్, భారత ఎన్నికల కమిషన్, పాలనా సంస్కరణల కమిషన్‌లు ఎన్నికల సంస్కరణలను సిఫారసు చేశాయి. అయితే ఈ సిఫారసులు అన్నింటిని ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఇప్పటికైనా తక్షణం సంస్కరణలు ప్రవేశపెట్టాలి. అలాగే దామాషా పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది.

# అనవసరంగా అరవొద్దు

## న్యాయవాదిపై సీజేఐ చంద్రచూడ్ ఆగ్రహం

**న్యూఢిల్లీ:** ఎన్నికల బాండ్ల కేసు విచారణ సందర్భంగా సీనియర్ న్యాయవాదిపై ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసు విచారణ నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానంలో అనేక నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. వీటిలో సీనియర్ న్యాయవాది మాథ్యూస్ నెడుంపర, సీజేఐ మధ్య ఆసక్తికర చర్చ జరిగింది. ఎన్నికల బాండ్ల కేసు న్యాయబద్ధమైన సమస్య కాదని, ఇది విధానపరమైన అంశమని న్యాయవాది మాథ్యూస్ నెడుంపర పేర్కొన్నారు. దీనిలో కోర్టులు జోక్యం చేసుకోవడం సరైనది కాదని తెలిపారు. కావున ఈ కేసులో తీర్పుపై పునఃసమీక్ష చేయాలని కోరారు. సీజేఐ మధ్యలో జోక్యం చేసుకొని 'మిస్టర్ నెడుంపర నేను ఈ దేశ పౌరుడిని. నాపై అరవొద్దు' అని గట్టిగా సమాధానమిచ్చారు. దీనిపై నెడుంపర స్పందిస్తూ.. 'లేదు, లేదు, నేను చాలా సాఫ్ట్‌గా మాట్లాడుతున్నాను' అంటూ బదులిచ్చారు.

సీజేఐ కల్పించుకొని... ఇది హైడ్ పార్క్ కార్నర్ మీటింగ్ కాదని అన్నారు. 'మీరు కోర్టులో ఉన్నారు. మీరు ఒకవేళ పిటిషన్ వేయాలనుకుంటే ఫైల్ చేయండి. నేను చీఫ్ జస్టిస్‌గా నా నిర్ణయం తెలియజేశాను. మీ మాటలు వినాలనుకోవడం లేదు. మీకు ఏమైనా సందేహాలు ఉంటే పిటిషన్ దాఖలు చేయండి. ఇది కోర్టు నియమం. దాని ప్రకారం నడుచుకోండి' అంటూ ఘాటుగా హెచ్చరించారు. న్యాయవాది నెడుంపర మళ్లీ వాదిస్తుండగా జస్టిస్ బీఆర్ గవాయి జోక్యం చేసుకుని..మీరు న్యాయ నిర్వహణ ప్రక్రియను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. అయినప్పటికీ న్యాయవాది వెనక్కి తగ్గలేదు. మాటలు కొనసాగిస్తుండగా ... 'ఇక మీరు ఆపండి. కోర్టు నియమాలు అనుసరించే వరకు మీ మాటలను మేము వినదల్చుకోలేదు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై నెడుంపర స్పందిస్తూ తాము పిటిషన్ దాఖలు చేయనున్నట్లు చెప్పారు. నెడుంపర గతంలో ఎదుర్కొన్న కోర్టు ధిక్కార చర్యను ధర్మాసనం గుర్తు చేసింది. 2019లో నెడుంపర కోర్టు ధిక్కారానికి పాల్పడినట్లు సుప్రీంకోర్టు పేర్కొంది. ఆ సమయంలో ఆయన ఇకపై సుప్రీంకోర్టు లేదా బాంబే హైకోర్టుకు చెందిన ఏ జడ్జిని తక్కువ చేసి మాట్లాడే ప్రయత్నం చేయనని హామీ ఇచ్చారు. దీంతో న్యాయస్థానం అతనికి మూడు నెలల జైలు శిక్ష విధించింది. ఏడాది పాటు సుప్రీంకోర్టులో ప్రాక్టీస్ చేయకుండా నిషేధం విధించింది. భవిష్యత్తులో ఇలాగే కొనసాగితే మాత్రం సస్పెండ్ చేస్తామని హెచ్చరించింది.

అదేవిధంగా కేసు విచారణలో భాగంగా సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అదిశ్ అగర్వాల్ వాదనలు వినేందుకు కూడా కోర్టు నిరాకరించింది. ఎన్నికల బాండ్ల పథకం రద్దుకు సంబంధించిన తీర్పుపై సుమోటోగా సమీక్ష చేయాలని అగర్వాల్ కోరడంతో చీఫ్ జస్టిస్ తీవ్రంగా స్పందించారు. 'మీరు సీనియర్ న్యాయవాది మాత్రమే కాదు...ఎస్సీబీఏ అధ్యక్షుడు. నా సుమోటో అధికారాలను ప్రశ్నిస్తూ లేఖ రాశారు. ఇవన్నీ ప్రచారానికి సంబంధించిన అంశాలు. మేము దీనిలో భాగం కాలేం. నన్ను ఇంకేమీ మాట్లాడనివ్వద్దు. ఇది అసహ్యంగా ఉంటుంది' ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సోనియాగాంధీతో భేటీ కాలేదు: చవాన్

**ముంబై:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రస్తావించిన సీనియర్ నాయకుడిని తాను కాదని బీజేపీ నేత, రాజ్యసభ ఎంపీ అశోక్ చవాన్ చెప్పుకొచ్చారు. రాజీనామా తర్వాత తాను సోనియాగాంధీతో భేటీ కాలేదని స్పష్టం చేశారు. ఆదివారం ముంబైలో జరిగిన భారత్ జోడో న్యాయ యాత్ర ముగింపు కార్యక్రమంలో రాహుల్ మాట్లాడుతూ తానిక్కడ పేర్లు ప్రస్తావించదల్చుకోలేదని, మహారాష్ట్రకు చెందిన ఒక సీనియర్ నేత కాంగ్రెస్‌ను వీడిన తర్వాత తన తల్లితో మాట్లాడారని తెలిపారు. 'సోనియాజీ.. వారితో పోరాడే శక్తి నాకు లేదు. నేను జైలుకు వెళ్లాలనుకోవడం లేదు. ఇలా మాట్లాడుతున్నందుకు సిగ్గుగా అనిపిస్తోంది' అని కన్నీటిపర్యంతమయ్యారని చెప్పారు. ఈ వ్యాఖ్యలు అశోక్ చవాన్‌ను ఉద్దేశించే అని వార్తలు వచ్చాయి. దీనిపై చవాన్ వీడియో సందేశం విడుదల చేశారు. రాహుల్‌గాంధీ చెప్పింది తన గురించే అయితే... ఆ మాటలు నిరాధారమైనవని చవాన్ చెప్పారు. తాను రాజీనామా చేసేవరకు ఆ విషయం ఎవరికీ తెలియదన్నారు. తన నిర్ణయం ప్రకటించేవరకు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలోనే పనిచేశానన్నారు. తాను సోనియాగాంధీతో భేటీ కాలేదని, తాను ఆమెతో మాట్లాడి, కన్నీరు పెట్టుకున్నానన్నది నిరాధారమైన వ్యాఖ్య అని చవాన్ చెప్పారు. ఎన్నికలను దృష్టిలోపెట్టుకొని ఈ ప్రకటనలు చేశారని పేర్కొన్నారు. కాగా, చవాన్‌పై అనేక కేసులున్నాయి. ఆదర్శ్ హౌసింగ్ సొసైటీ కుంభకోణంలో ప్రమేయం ఉందన్న ఆరోపణలతో 2010లో ముఖ్యమంత్రి పదవికి ఆయన రాజీనామా చేశారు.

## రాజకీయాల్లోకి లాలు కూతురు రోహిణి

### సరన్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ?

**పాట్నా:** రాష్ట్రీయ జనతాదళ్ అధినేత లాలు ప్రసాద్ యాదవ్ మరో కూతురు రోహిణి ఆచార్య రాజకీయ రంగ ప్రవేశం చేయబోతున్నారని ఆర్జేడీ వర్గాలు సూచన ప్రాయంగా తెలిపాయి. లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగుతున్నారని తెలుస్తోంది. లాలు కుటుంబానికి కంచుకోట అయిన సరన్ లోక్‌సభ నుంచి ఆర్జేడీ తరఫున ఆమె పోటీ చేస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం లాలు ప్రసాద్ యాదవ్ కుటుంబం నుంచి ఇద్దరు కుమారులు తేజ్ ప్రతాప్ యాదవ్, తేజస్వి యాదవ్, పెద్ద కూతురు మీసా భారతి రాజకీయాల్లో ఉన్నారు. గత ప్రభుత్వంలో తేజస్వి యాదవ్, తేజ్ ప్రతాప్ యాదవ్ మంత్రులుగా పనిచేశారు. మరో కూతురు రాజకీయ రంగ ప్రవేశం చేయబోతున్నారు. లాలు ప్రసాద్ యాదవ్ అనారోగ్యానికి గురైన సమయంలో రోహిణి అండగా నిలిచారు. తండ్రికి తన కిడ్నీని అందజేసి ప్రేమను చాటుకున్నారు. సింగపూర్ ఆస్పత్రిలో 2022 డిసెంబరులో లాలు ప్రసాద్ యాదవ్‌కు కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స జరిగింది. ఆర్జేడీ పార్టీ సమావేశం ఆదివారం పాట్నాలో జరగగా సరన్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసే అభ్యర్థిపై చర్చ వచ్చింది. రోహిణి ఆచార్య పేరును ఆర్జేడీ ఎమ్మెల్సీ సునీల్ కుమార్ సింగ్ ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదనకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సరన్ లోక్‌సభ స్థానం నుంచి రోహిణి ఆచార్య పోటీ చేయడం ఖాయమైంది.

## వృద్ధులు... దివ్యాంగులకు ఆన్‌లైన్ ఓటింగ్

### మాజీ సీఈసీ కృష్ణమూర్తి సూచన

**న్యూఢిల్లీ:** సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు, యూనిఫాం సర్వీస్‌ల సభ్యులకు ఆన్‌లైన్ ఓటింగ్ సదుపాయం కల్పించాలని భారత మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ టి.ఎస్.కృష్ణమూర్తి సోమవారం సూచించారు. రాజకీయ పార్టీలు డిజిటల్ మీడియా శక్తిని ఉపయోగించుకుని, భౌతిక బహిరంగ సభల సంఖ్యను తగ్గించి ఆన్‌లైన్ ప్రచారాన్ని ఎక్కువగా ఎంచుకునే అవకాశాన్ని తీవ్రంగా అన్వేషించాలన్నారు. కృష్ణమూర్తి పీటీఐతో మాట్లాడుతూ తాను కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్‌గా ఉన్న సమయంలో సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు ఆన్‌లైన్ ఓటింగ్ ఎంపికలను ఇవ్వాలనే ప్రతిపాదనను పరిశీలించామని, ఐఐటీ మద్రాస్‌తో అనధికారిక సంప్రదింపులు కూడా జరిగాయని చెప్పారు. అయితే ఓటింగ్ సమయంలో గోప్యతను ఉల్లంఘించే అవకాశం ఉందని పేర్కొంటూ రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయని ఆయన అన్నారు. 'ఇంటర్నెట్ ఓటింగ్‌ను అనుమతించిన దేశాలు ఉన్నప్పటికీ, మనం రాజకీయ పార్టీల (భారతదేశంలో) సమ్మతితో కొనసాగించాలి. కనీసం ప్రారంభంలో సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, యూనిఫాం సేవల్లో ఉన్న వారందరికీ ఇంటర్నెట్ ఓటింగ్ ఇవ్వవచ్చు' అని చెప్పారు. 'మనం దాని గురించి తీవ్రంగా ఆలోచించాలి' అని కృష్ణమూర్తి అన్నారు. డిజిటల్ రంగంలో భారతదేశం సాధించిన పురోగతితో రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారం కోసం భౌతిక సమావేశాల సంఖ్యను తగ్గించగలరా లేదా అనే విషయాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం, భారతదేశం ఎన్నికల ముందు 'చాలా' బహిరంగ సభలను చూస్తుందని ఆయన తెలిపారు. ఎన్నికల సమయంలో తన మెక్సికో పర్యటనను గుర్తు చేసుకుంటూ, కృష్ణమూర్తి అక్కడ చాలా తక్కువ భౌతిక బహిరంగ సభలను చూశానని, ఎక్కువ ప్రచారం టీవీ, ఆన్ లైన్‌లో జరిగిందన్నారు. 'ఇవి మనం పరిశీలించాల్సిన విషయాలు' అని ఆయన అన్నారు. అయితే ఇంత పెద్ద పరిమాణంలో ఉన్న దేశం అయినందున మనం (భారతదేశం) జాగ్రత్తగా అడుగులు వేయాలి. ఎందుకంటే ఇది అనవసరమైన ద్వేషం, హింస, అలాంటి వాటిని ప్రోత్సహిస్తున్నందున భౌతిక ప్రచార ర్యాలీల సంఖ్యను తగ్గించడం చాలా అవసరం' అని తెలిపారు.

## కర్నాటకలో బీజేపీకి దెబ్బమీద దెబ్బ

### కాంగ్రెస్ గూటికి మాజీ సీఎం సదానంద గౌడ?

**బెంగళూరు:** లోక్‌సభ ఎన్నికల ముందు కర్నాటక బీజేపీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇప్పటికే ఆ పార్టీకి చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారిలో ఒకరు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ తరుణంలో బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత, మాజీ సీఎం, కేంద్రమంత్రి డీవీ సదానంద్ గౌడ్ పార్టీకి రాజీనామా చేయనున్నారు. గత ఏడాది జరిగిన కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘోర పరాజయం చవి చూసింది. 224 అసెంబ్లీ స్థానాల్లో బరిలోకి దిగిన కమలం కేవలం 66 స్థానాలకే పరిమితమైంది. కాంగ్రెస్ 135 స్థానాల్లో విజయం సాధించి అధికారం చేపట్టింది. అయితే, త్వరలో జరగబోయే 28 లోక్‌సభ స్థానాలకు జరిగే ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకుని కాంగ్రెస్‌కు ధీటుగా సమాధానం చెప్పాలని భావిస్తున్న కాషాయ దళానికి ఆ పార్టీ నేతలు వరుసగా గుడ్‌బై చెబుతున్నారు.

కొద్ది రోజుల క్రితం కేపీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు జి.పరమేశ్వర, కేజే జార్జ్ సమక్షంలో బైందూరు మాజీ ఎమ్మెల్యే సుకుమార్ శెట్టి, ముదిగెరె మాజీ ఎమ్మెల్యే ఎంపీ కుమారస్వామితో పాటు కర్నాటక ప్రభుత్వంలో రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా పనిచేసిన కోర్గి జయప్రకాశ్ హెగ్డే కాంగ్రెస్‌లో చేరారు. గతంలో ఉడిపి, చిక్కమగళూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందిన హెగ్డే ఈసారి అదే నియోజకవర్గం నుంచి బరిలోకి దిగనున్నారు. టికెట్ ఇచ్చే విషయంలో అధిష్ఠానం ఇప్పటికే ఆయనతో చర్చలు జరిపిందని కాంగ్రెస్ పార్టీ వర్గాల విశ్వసనీయ సమాచారం. తాజాగా సదానంద్ గౌడ సైతం పార్టీని వదిలి వెళ్లడంపై బీజేపీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి వైసీకే వడియార్‌పై కాంగ్రెస్ తరఫున మైసూరు లోక్‌సభ నియోజక వర్గం నుంచి బరిలోకి దిగనున్నారు. అయితే ఇప్పటికే కాంగ్రెస్ నేతలతో టచ్‌లో ఉన్న సదానంద్ గౌడ బీజేపీకి రాజీనామా, కాంగ్రెస్‌లో చేరిక, ఏ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయనున్నారనే అంశాలపై మరో రెండ్రోరోజుల్లో అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.

## మనస్తాపంతో బాలిక ఆత్మహత్య

### దొంగతనం నేరం మోపి... బట్టలు విప్పించిన కీచక టీచర్

**బెంగళూరు:** సాధారణంగా ఎవరైనా తప్పు చేస్తే దానిపై విచారణ జరిపి శిక్ష వేసే అధికారం పోలీసులు, న్యాయవ్యవస్థకు ఉంది. కానీ కొందరు మాత్రం అవేవీ పట్టించుకోకుండా రెచ్చిపోతుంటారు. తాజాగా కర్నాటక రాజధాని బెంగళూరులోనూ అలాంటి ఘటనే జరిగింది. ఓ విద్యార్థిని దొంగతనం చేసిందని ఆరోపిస్తూ ఆమెతో బలవంతంగా దుస్తులు విప్పించారు. తీవ్ర అవమానాన్ని తట్టుకోలేక బాధితురాలు రెండు రోజుల అనంతరం ఆత్మహత్య చేసుకుంది. స్థానికంగా ఉండే ఓ పాఠశాలలో చదువుతున్న బాలికపై అదే స్కూల్‌లోని టీచర్ పర్సులో నుంచి రూ.రెండు వేలు దొంగతనం చేసిందని ఆరోపణలు మోపారు. తాను తీయలేదని తనకేమీ తెలియదని చెబుతున్నా వినిపించుకోకుండా సదరు ఉపాధ్యాయుడు ఆమెతో దుస్తులు విప్పించాడు. అంతటితో ఆగకుండా బాలిక ఏ తప్పు చేయలేదని ప్రమాణం చేసేందుకు సమీపంలోని ఆలయానికి తీసుకెళ్లడంతో బాలిక తీవ్ర మనస్తాపానికి గురైంది. రెండు రోజులుగా ఎవరితోనూ మాట్లాడలేదు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకుంది. అదే పాఠశాలలో చదువుతున్న బాధితురాలి సోదరి ద్వారా ఈ విషయాలు తెలుసుకున్న కుటుంబసభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాలిక మృతికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. మరోవైపు ఈ ఘటనపై మాట్లాడేందుకు పాఠశాల యాజమాన్యం నిరాకరించింది.

## కాంగ్రెస్‌కు పెద్ద కుదుపు

### పార్టీ వీడిన సీనియర్ నేతలు

**భోపాల్:** లోక్‌సభ ఎన్నికలకు ముందు మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు భారీ షాక్ తగిలింది. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ సీఎం కమల్‌నాథ్ సన్నిహితుడు చింద్వారాకు చెందిన సయ్యద్ జాఫర్‌తో పాటు మరికొందరు కాంగ్రెస్ నేతలు బీజేపీలో చేరారు. బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి ఆర్.ఎస్.వర్మ కాషాయ కండువా కప్పుకున్నారు. వీరంతా బోపాల్‌లో సీఎం మోహన్ యాదవ్, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వీడీ శర్మ సమక్షంలో బీజేపీలో చేరారు. చింద్వారాకు చెందిన జాఫర్ కాంగ్రెస్ సీనియర్ నేత, కమల్‌నాథ్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్నారు. జాఫర్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఉన్నట్లు ఎక్స్‌లోని తన ప్రొఫైల్‌లో పెట్టుకున్నారు. అయితే జాఫర్ ప్రస్తుతం పార్టీలో ఎలాంటి పదవుల్లో లేరని కాంగ్రెస్ మీడియా విభాగం చైర్మన్ కేకే మిశ్రా తెలిపారు. మాజీ సీఎం కమల్‌నాథ్ బీజేపీలో చేరతారంటూ ఇటీవల ప్రచారం జరిగింది. ఆ వార్తలపై స్పందించిన కమల్‌నాథ్... తనకు అటువంటి అభిప్రాయం లేదని, కాంగ్రెస్‌లోనే ఉన్నానని తెలిపారు. తాజాగా కమల్‌నాథ్‌కు అత్యంత సన్నిహితంగా ఉండే జాఫర్ బీజేపీలో చేరడంతో చింద్వారాలో ఆ పార్టీకి బిగ్ షాక్ తగిలినట్లైంది. జాఫర్‌తోపాటు మధ్యప్రదేశ్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మనీషా దూబే కాషాయ కండువా కప్పుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంక్షేమ పథకాలు, విధానాలకు ప్రభావితమై బీజేపీలో చేరామని జాఫర్ తెలిపారు. కేంద్ర మాజీ మంత్రి సురేశ్ పచౌరీ, మాజీ ఎంపీ గజేంద్ర సింగ్ రాజుఖేడితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు బీజేపీలో చేరిన కొద్దిరోజులకే మరికొంతమంది సీనియర్లు హస్తం పార్టీని వీడి బీజేపీలో చేరిపోయారు.

## కోల్‌కతాలో కుప్పకూలిన భవనం

### ఐదుగురి మృతి...ఏడుగురికి తీవ్ర గాయాలు

**కోల్‌కతా:** పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో నిర్మాణంలో ఉన్న ఓ ఐదంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో ఐదుగురు మృతి చెందగా... ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. మరో పది మందిని సహాయక సిబ్బంది కాపాడారు. శిథిలాల కింద మరికొంత మంది ఉండొచ్చన్న అనే అనుమానంతో సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు నగర మేయర్ ఫిర్హాద్ హకీమ్ తెలిపారు. ఈ ఘటన ఆదివారం రాత్రి గార్డెన్ రిచ్ ప్రాంతంలో జరిగినట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంపై రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. అనంతరం ఆస్పత్రికి వెళ్లి చికిత్సపొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ... 'ప్రమాదం జరిగిన వెంటనే అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారు. ఈ భవనాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం అధికారికంగా అనుమతి ఇవ్వలేదు. ఈ భవన నిర్మాణానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ ఘటనపై దర్యాప్తును చేపట్టారు. మృతుల కుటుంబాలకు రూ.ఐదులక్షలు, గాయపడిన వారికి రూ.లక్ష పరిహారం అందిస్తాం. ఈ ఘటన వల్ల సమీపంలో ఉన్న ఇళ్లు కూడా దెబ్బతిన్నాయి. ప్రభుత్వం వారికి కూడా సహాయం చేస్తుంది' అని మమతా బెనర్జీ తెలిపారు. ఘటన జరిగిన భవనంలో ఎవరూ లేరని స్థానికులు తెలిపారు. కానీ, దాని పరిసర ప్రాంతాల్లో పేదలు నివసిస్తున్న గుడిసెలపై శిథిలాలు పడ్డాయని చెప్పారు. వాటిలో ఎవరైనా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. పదుల సంఖ్యలో శిథిలాల్లో చిక్కుకొని ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అంబులెన్సులను సిద్ధంగా ఉంచామని నగర సీపీ వినీత్ గోయల్ తెలిపారు. ఈ ఘటనపై బీజేపీ నేత సువేందు అధికారి స్పందించారు. కావాల్సిన సహాయక చర్యలను ముమ్మరం చేయాలని ప్రభుత్వానికి 'ఎక్స్' వేదికగా విజ్ఞప్తి చేశారు.

## రెండు, మూడు రోజుల్లో సీట్ల సర్దుబాటు ఖరారు

### ఆర్‌జేడీ నాయకుడు తేజస్వి

**న్యూఢిల్లీ:** 'ఇండియా' కూటమి మిత్రపక్షాల మధ్య బీహార్‌లో సీట్ల పంపకం చివరి దశలో ఉందని, మరికొద్ది రోజుల్లోనే సీట్లు ఖరారవుతాయని ఆర్‌జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ సోమవారం తెలిపారు. ఆదివారం శివాజీ పార్క్ వద్ద ప్రతిపక్ష 'ఇండియా' కూటమి నిర్వహించిన ర్యాలీకి హాజరైన తర్వాత ముంబై నుంచి ఇక్కడకు వచ్చిన ఆర్‌జేడీ నాయకుడు విలేకర్లతో మాట్లాడుతూ చాలా సమస్యలు పరిష్కారమయ్యాయని, ఒకటి లేదా రెండు సీట్లలో మాత్రమే సమస్యలు ఉన్నాయని చెప్పారు. రెండు, మూడు రోజుల్లో ప్రతిదీ నిర్ణయిస్తామని, అన్నీ సర్దుకుంటాయన్నారు. రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ), కాంగ్రెస్, వామపక్షాలు, కొన్ని ఇతర చిన్న పార్టీలు లోక్‌సభ ఎన్నికలలో ఎన్‌డీఏను ఎదుర్కోవడానికి సీట్ల పంపకం కోసం చర్చలు జరుపుతున్నాయి. పేపర్ లీకేజీ వ్యవహారంపై బీహార్ మాజీ డిప్యూటీ సీఎం కూడా రాష్ట్రంలోని బీజేపీ-జేడీయూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే పేపర్ లీక్ లాంటి ఘటనలు జరగడానికి కారణమేంటి... దీనికి బాధ్యులెవరు?, యువత భవిష్యత్తుతో ఆడుకుంటున్న వారిపై చర్యలు తీసుకుంటారా?' అని ఆర్‌జేడీ నాయకుడు ప్రశ్నించారు.

## హిమాచల్ రెబల్ ఎమ్మెల్యేలకు ఎదురుదెబ్బ

### అనర్హతపై స్టే విధించేందుకు 'సుప్రీం' నో

**న్యూఢిల్లీ:** హిమాచల్‌ప్రదేశ్ కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేలకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. రాజ్యసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన సంగతి తెలిసిందే. ఆ ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు వేశారు. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ రెబల్ ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అనర్హతపై స్టే విధించాలని కోరగా, సుప్రీంకోర్టు ధర్మాసనం నిరాకరించింది. సభలో ఓటు వేసేందుకు లేదా సభా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అనుమతి నిరాకరించింది. రెబల్ ఎమ్మెల్యేల తరఫున సీనియర్ లాయర్ హరీశ్ సాల్వే వాదనలు వినిపించారు. ఫిబ్రవరిలో రాజ్యసభ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ మనుసింఘ్వీకి ఓటు వేయలేదు. బీజేపీ నేత హర్ష్ మహాజన్‌కు ఆరుగురు ఎమ్మెల్యేలు ఓటు వేశారు. దాంతో హర్ష్ మహాజన్ గెలుపొందారు. క్రాస్ ఓటింగ్ వేసిన సభ్యులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ స్పీకర్‌ను కోరింది. ఆరుగురు సభ్యులపై స్పీకర్ అనర్హత వేటు వేశారు. హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు, అక్కడి నుంచి సుప్రీంకోర్టును రెబల్ ఎమ్మెల్యేలు ఆశ్రయించారు. స్పీకర్ నిర్ణయంపై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం నిరాకరించింది.

## బీహార్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### 8 మంది దుర్మరణం

**పాట్నా:** బీహార్‌లోని ఖగారియాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ట్రాక్టర్, కారు ఢీ కొన్న ఘటనలో ముగ్గురు చిన్నారులు సహా ఎనిమిది మంది దుర్మరణం చెందారు. వివాహ వేడుకకు వెళ్లి తిరిగి వస్తుండగా సోమవారం తెల్లవారుజామున 5గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు వెల్లడించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంతో పెళ్లింట తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ఖగారియాలో పెళ్లి ఊరేగింపు నుంచి తిరిగి వస్తున్న కారును పస్రాహా పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై విద్యానంద్ పెట్రోల్ పంప్ సమీపంలో సిమెంట్ లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ప్రమాదంలో కారు అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న కాలువలోకి బోల్తా పడింది. ఈ ఘోర ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. ముగ్గురు చిన్నారులు కూడా మరణించడం అందర్నీ కలచివేసింది. ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన వారు ఎక్కువగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేప ట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ అజాగ్రత్త, అతివేగం కారణంగా ప్రమాదం జరిగిందని గోగ్రి డీఎస్పీ రమేశ్‌కుమార్ తెలిపారు. ప్రమాద సమయంలో కారు వేగంగా వెళు తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదం తర్వాత ఆ ప్రాంతమంతా భీతావాహంగా మారింది. స్థానికులు భారీగా ఘటనా స్థలానికి తరలివచ్చారు. ప్రమాదంలో కారు తీవ్రంగా దెబ్బతింది.

## జేడీఎస్, ఇతర పార్టీలకు విరాళాలు ఇచ్చా

### ఎన్నికల బాండ్లపై కిరణ్ మజుందార్ షా

**న్యూఢిల్లీ:** ప్రముఖ ఔషధ తయారీ సంస్థ బయోకాన్ లిమిటెడ్ ఏ పార్టీకీ ఎన్నికల బాండ్ల ద్వారా విరాళాలివ్వలేదని కంపెనీ ఛైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా సోమవారం వెల్లడించారు. అయితే, తాను వ్యక్తిగత హోదాలో కొన్ని బాండ్లను కొనుగోలు చేసి మాజీ ప్రధానమంత్రి హెచ్‌డీ దేవెగౌడ నేతృత్వంలోని జేడీఎస్ సహా మరికొన్ని పార్టీలకు ఇచ్చినట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారాలకు చట్టబద్ధమైన సొమ్ముతో నిధులు సమకూర్చాలనే విధానం కింద నామమాత్రపు విరాళాలు అందజేసినట్లు చెప్పారు. గత ఏడాది జరిగిన కర్నాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్నికల బాండ్ల ద్వారా కిరణ్ మజుందార్ ప్రతినెలా రూ.5 కోట్ల విరాళమిచ్చారని ఇటీవల 'ఎక్స్'లో ఓ యూజర్ పోస్ట్ చేశాడు. దీనిపై స్పందించిన ఆమె 'మీ లెక్కలు తప్పు' అని సమాధానమిచ్చారు. మరోసారి గణించాలని కోరారు. దీంతో ఆమె మొత్తం రూ.6 కోట్లు ఇచ్చినట్లు మరో యూజర్ తెలిపాడు. అయితే, ఇతర మాధ్యమాల ద్వారా ఏమైనా ఇచ్చి ఉంటే వెల్లడించాలన్నాడు. తానెప్పుడూ పారదర్శకంగానే ఉంటానని, మీరు చూస్తున్నది మాత్రమే నిజమని పరోక్షంగా తాను రూ.6 కోట్లు మాత్రమే ఇచ్చినట్లు ధ్రువీకరించారు. కాగా, ఎన్నికల బాండ్ల పథకం ప్రారంభమైన 2018 మార్చి నుంచి రాజకీయ పార్టీలు నగదుగా మార్చుకున్న వాటి వివరాలను ఎన్నికల సంఘం తాజాగా వెల్లడించింది. బీజేపీకి మొత్తంమీద రూ.8,718.5 కోట్లు విరాళంగా వచ్చినట్లు తెలిపింది. మొత్తం రాజకీయ పార్టీలకు లభించిన వాటిలో దీనికి 66 శాతం దక్కాయి. కాంగ్రెస్‌కు రూ.1,864.45 కోట్లు అందాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు రూ.1,494.28 కోట్లు, బీఆర్‌ఎస్‌కు రూ.1,408.20 కోట్ల మేర విరాళాలు అందుకున్నాయి.

## హ్యాట్రిక్‌పై బీజేపీ కన్ను

**లక్నో:** ఉత్తర ప్రదేశ్‌లోని గౌతమ్‌బుద్ధ నగర్ లోక్‌సభ నియోజకవర్గంపై బీజేపీ బీజేపీ కన్నేసింది. జీబీ నగర్‌లోని నోయిడా, జేవార్, దాద్రీ, బులంద్‌షహర్‌లోని సికింద్రాబాద్, ఖుర్జాలతో కూడిన మొత్తం ఐదు సెగ్మెంట్లలో గౌతమ్ బుద్ధనగర్ నియోజకవర్గంలో 2022 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన బీజేపీ... రానున్న లోక్‌సభ ఎన్నకల్లోనూ అవే ఫలితాలను అంచనా వేస్తోంది. ఇక్కడ గట్టి పోటీ ఇచ్చేందుకు బీఎస్పీ, కాంగ్రెస్, ఎస్పీ సహా ప్రధాన రాజకీయ పార్టీలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఇప్పటికే ఈ నియోజకవర్గంలో రెండుసార్లు గెలిచిన బీజేపీ...హ్యాట్రిక్‌పై దృష్టి సారించింది. తమ ప్రభుత్వం చేపట్టిన నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం, దాద్రీ, బోడకిలో రవాణా సౌకర్యాలు, రైలు, మెట్రో విస్తరణ కారిడార్ సహా అనేక అభివృద్ధి ప్రాజెక్టులు, పారిశ్రామిక కేంద్రాలతో పాటు రెండుసార్లు ఎంపీగా పనిచేసిన డాక్టర్ మహేశ్‌శర్మపై బీజేపీ విశ్వాసంతో ఉంది. గౌతమ్ బుద్ధ నగర్ రాజకీయ చరిత్రలో డాక్టర్ మహేశ్ శర్మ విజయ పరంపర దశాబ్దం క్రితమే మొదలైంది. 2014 ఎన్నికలలో డాక్టర్ శర్మ 5,99,702 ఓట్లు, 50 శాతం ఓట్లతో మొదటిసారి విజయం సాధించారు. సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి నరేంద్ర భాటిని 2,80,212 ఓట్ల తేడాతో ఓడించారు. 2019 ఎన్నికలలో 8,30,812 ఓట్లు, 59.64 శాతం ఓట్లతో మరోసారి గెలుపొందారు. ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వరకు ఏడు దశల్లో 2024 లోక్‌సభ ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల సంఘం ప్రకటించింది. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనుంది. నోయిడా పేరుతో ప్రసిద్ధి చెందిన గౌతమ్ బుద్ధనగర్ లోక్‌సభ స్థానానికి రెండో దశలో ఉత్తరప్రదేశ్‌లోని ఇతర నియోజకవర్గాలతో పాటు ఏప్రిల్ 26న పోలింగ్ జరగనుంది.

# చట్ట సభలకు ఎర్రజెండా ప్రతినిధులు

**ఏపీలో బీజేపీకి ఓట్లు పడవు**

**సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ**

విశాలాంధ్ర-విజయవాడ: ప్రజాసమస్యలపై గొంతెత్తే ఎర్రజెండా పార్టీల ప్రతినిధులను చట్టసభలకు పంపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక సితార సెంటర్ వద్ద గల ఎన్‌కన్వెన్షన్ హాల్‌లో సోమవారం ఆ పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అధ్యక్షతన ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల సమితుల సంయుక్త సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన రామకృష్ణ మాట్లాడుతూ విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థి ఎన్నికల బరిలో ఉంటున్నారని తెలిపారు. చిలకలూరిపేట సభలో ప్రధాని మోదీ అన్నీ అబద్ధాలు చెప్పారని విమర్శించారు. కాంగ్రెస్, వైసీపీ రెండూ ఒక్కటే అని ప్రధాని చేసిన వ్యాఖ్యలను ఖండించారు. జగన్ పాలన అరాచకంగా ఉండటానికి కేంద్రంలోని బీజేపీయే కారణమన్నారు. కేంద్రం అనుమతి లేనిదే జగన్ ప్రభుత్వం అప్పులు తీసుకురాలేదని చెప్పారు. లోక్‌సభ, రాజ్యసభలో వైసీపీ ఎంపీలు అన్ని అంశాల్లో మోదీ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చారని గుర్తుచేశారు. వివాదాస్పద సీఏఏ, ఎన్ఆర్‌సీ బిల్లుకూ మద్దతు ఇచ్చిన విషయాన్ని విస్మరించరాదన్నారు. జగన్ కేసుల విషయంలో ప్రధాని మోదీ సహాయం చేస్తున్నారని చెప్పారు. వైఎస్ వివేకానంద రెడ్డిని ఎవరు చంపిందీ పులివెందులలో అందరికీ తెలిసినా సీబీఐ మాత్రం కనిపెట్టలేకపోతోందని ఎద్దేవా చేశారు. బీజేపీకి 370 సీట్లు, ఎన్‌డీఏకు 400 సీట్లు అంటూ బీజేపీ మైండ్ గేమ్ ఆడుతోందని మండిపడ్డారు. దేశంలో అన్ని మతాలు, కులాలు కలిసి ఉండటానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగమే కారణమన్నారు. పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలకు చేసింది ఏమిటో చెప్పుకోలేని పరిస్థితుల్లో మతోన్మాదాన్ని రెచ్చగొడుతోందన్నారు. మోదీ ప్రభుత్వం ఎన్నిసార్లు అధికారంలోకి వచ్చినా కమ్యూనిస్టు పార్టీకి ఢోకా ఉండదన్నారు. ప్రాంతీయ పార్టీలను మింగేయటమే బీజేపీ అజెండాగా ఉందన్నారు. చేతివృత్తుల వారి జీవనం కష్టంగా మారిందన్నారు. సీఎం జగన్‌కు ప్రజాస్వామ్యమంటే గౌరవం లేదన్నారు. రాష్ట్రంలో 49 సీట్లు రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించారని ఆరోపిస్తూ... దీనినే జగన్ సామాజిక న్యాయం పాటిస్తున్నట్లు గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారని పేర్కొన్నారు.

విజయవాడ పశ్చిమలో సీపీఐ గెలుపు ఖాయం: రాష్ట్రంలో బీజేపీకి ప్రజలు ఓట్లు వేయరని రామకృష్ణ స్పష్టం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థి విజయం సాధించటం తథ్యమన్నారు. సీపీఐ కేంద్ర కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ ఏపీ రాజధానిగా అమరావతిలో శంకుస్థాపన చేసిన మోదీ... జగన్ ప్రభుత్వం మూడు రాజధానులు అంటే ఎందుకు పట్టించుకోలేదని సందేహం వ్యక్తం చేశారు. ఎన్‌డీఏకు వ్యతిరేకంగా ఇండియా కూటమి బలపడే విధంగా రాజకీయ పరిస్థితులు మారుతున్నాయని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ 2014లో టీడీపీ, బీజేపీ పొత్తు ఉందని, 2019లో బీజేపీతో వైసీపీ లోపాయకారి పొత్తు ఉందని, డబుల్ ఇంజన్ సర్కార్ ఉన్నా అభివృద్ధిలో ఏపీ వెనుకబడిందని చెప్పారు. విజయవాడ పశ్చిమం నుంచి 2004లో కాంగ్రెస్, వామపక్షాల కూటమి పోటీ చేస్తే సీపీఐ అభ్యర్థి నాసర్‌వలి విజయం సాధించారని, మరలా 2024లో అదే కూటమి పోటీ చేస్తుందని, సంప్రదాయం ప్రకారం తిరిగి ఇక్కడ నుంచి సీపీఐ అభ్యర్థి విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అభ్యర్థి...ధనబలం గల ప్రత్యర్థులను ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే అధ్యక్ష తరహా పాలన తప్పదని హెచ్చరించారు. సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో 254 బూత్‌లు, 64 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వివరించారు. ఓటరు నమోదుపై పార్టీ శ్రేణులు ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. తొలుత సీపీఐ కృష్ణా జిల్లా కార్యదర్శి టి.తాతయ్య స్వాగతం పలకగా... విజయవాడ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు వందన సమర్పణ చేశారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య, నాయకులు ఎస్‌కే నజీర్, కేవీ భాస్కరరావు, డి.సూరిబాబు, శర్మ బృందం కమ్యూనిస్టు సిద్ధాంతాలను వివరిస్తూ అభ్యుదయ గీతాలు ఆలపించింది. సీపీఐ కృష్ణాజిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేశ్, సీపీఐ సీనియర్ నాయకులు కొరగంజి దుర్గాంబ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాణ స్వీకారానికి జైలు నుంచి పార్లమెంటుకు తీసుకెళ్లండి: ఢిల్లీ కోర్టు

**మద్యం కుంభకోణం కేసులో అరెస్టైన రాజ్యసభ సభ్యుడు సంజయ్‌సింగ్**

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్‌కు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆమ్‌ఆద్మీ పార్టీ నేత సంజయ్‌సింగ్... ప్రస్తుతం జైల్లో ఉన్న సంగతి తెలిసిందే. రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన ఆయనను ప్రమాణస్వీకారం కోసం మంగళవారం తిహార్ జైలు నుంచి పార్లమెంటుకు తీసుకెళ్లాలని ఢిల్లీ కోర్టు ఆదేశించింది. ఇందుకు అవసరమైన భద్రత కల్పించాలని జైలు అధికారులకు సూచించింది."రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేయడం కోసం నిందితుడిని పార్లమెంటుకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేయండి. అది పూర్తైన తర్వాత జైలుకు సురక్షితంగా తీసుకురండి" అని తిహార్ జైలు సూపరింటెండెంట్‌కు ప్రత్యేక న్యాయమూర్తి ఎం.కె.నాగ్‌పాల్ ఆదేశాలు జారీ చేశారు. ఆ సమయంలో సంజయ్‌సింగ్ మొబైల్ వాడకుండా చూడటంతో పాటు ఇతర నిందితులు, సాక్షులు, మీడియాతోనూ సంభాషించకుండా చూడాలని అందులో పేర్కొన్నారు. కేవలం అతడి న్యాయవాది, కుటుంబసభ్యులతో మాత్రమే మాట్లాడేందుకు అనుమతిచ్చారు.ఇదిలాఉంటే, ఆప్ నేత సంజయ్‌సింగ్ రాజ్యసభ పదవీకాలం ఈ ఏడాది జనవరి 27తో ముగిసింది. ఈ క్రమంలోనే సంజయ్‌ని ఆమ్‌ఆద్మీ పార్టీ రెండోసారి ఎంపీగా నామినేట్ చేసింది. అయితే ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించి నమోదైన సీబీఐ కేసు ఆధారంగా దర్యాప్తు చేస్తున్న ఈడీ... సంజయ్‌సింగ్‌ను గతేడాది అక్టోబరు నాలుగున అరెస్టు చేసింది.

## నా వ్యాఖ్యలను వక్రీకరించారు: రాహుల్

న్యూఢిల్లీ: 'శక్తి'పైనే తమ పోరాటం అంటూ తాను చేసిన వ్యాఖ్యలను ప్రధాని మోదీ వక్రీకరించారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అవి ఏ మతపరమైనవి కావని... కేవలం అధర్మం, అవినీతి, అసత్యాల గురించేనని సోమవారం ఆయన వివరణ ఇచ్చారు. మోదీ వేసుకున్న 'ముసుగు పవర్'ను ఉద్దేశిస్తూ తాను అలా మాట్లాడానన్నారు. 'నా మాటలు మోదీకి ఇష్టముండదు. వాటిని వక్రీకరిస్తూ ఏదోవిధంగా అర్థాలు మార్చేందుకు ప్రయత్నిస్తుంటారు. ఎందుకంటే నేను మట్లాడేవి గంభీరమైన వాస్తవాలని వారికి తెలుసు' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. తాను పేర్కొన్న 'శక్తి' మోదీ వేసుకున్న ముసుగు గురించేనన్నారు. దానిపైనే తాము పోరాడుతున్నామని చెప్పారు. సీబీఐ, ఈడీ, ఈసీ, మీడియాతోపాటు అన్ని వ్యవస్థలను ప్రభావితం చేసే శక్తి వారికుందన్నారు. కొన్ని వేల రూపాయల రుణాలను చెల్లించలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే... రూ.వేల కోట్ల విలువైన బ్యాంకు రుణాలను ప్రధాని మాఫీ చేస్తున్నారని ఆరోపించారు.

## 'డబుల్ ఇంజన్'తో రాష్ట్రానికి ఒరిగేదేమీలేదు

**సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జగదీశ్**

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: ప్రధాని నరేంద్రమోదీ చెబుతున్నట్లుగా డబుల్ ఇంజన్ సర్కారుతో రాష్ట్రానికి ఒరిగేదేమీ ఉండదని... గతంలోనే ఇది నిరూపితమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీశ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన సీపీఐ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. చిలకలూరిపేట సభలో ప్రధాని...రాష్ట్రంలో విధ్వంసకర పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని నేరుగా విమర్శించకుండా ప్రసంగించారన్నారు. పార్లమెంటులో రైల్వే జోన్ రాకపోవడానికి జగనే కారణమని రైల్వే శాఖ మంత్రి చెప్పినా కూడా నరేంద్ర మోదీ చెప్పకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. దీన్ని బట్టి వైసీపీపై ఆయనకున్న మమకారాన్ని చంపుకోలేకపోతున్నట్లు స్పష్టమవుతోందన్నారు. విధిలేకనే టీడీపీ, జనసేనలతో జతకట్టి పనిచేస్తున్నారన్నారు. ఐదు కోట్ల ఆంధ్రులు నరేంద్ర మోదీ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని గుర్తించి... ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఆదివారం గుత్తిలో వీరభద్రస్వామి అధ్యక్షతన సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారని, అనంతపురం అర్బన్ స్థానానికి సీపీఐ పోటీ చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గం ప్రతిపాదించిందన్నారు. అనంత జిల్లా నుంచి అభ్యర్థులుగా జిల్లా కార్యదర్శి జాఫర్, జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామిని ఎంపిక చేసి వారి పేర్లను రాష్ట్ర పార్టీకి ఇవ్వడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో కలిసి వచ్చే కాంగ్రెస్, సీపీఎం పార్టీలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర కార్యదర్శి చెప్పడం జరిగిందన్నారు. సీపీఐ అభ్యర్థిని ప్రకటించిన వెంటనే వారి గెలుపు కోసం పని చేస్తామన్నారు. జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ... భారతీయ జనతా పార్టీ అధికారంలో వచ్చిన పది సంవత్సరాల కాలంలో ఎన్నికల బాండ్ల పేరుమీద వ్యాపారం చేశారన్నారు. ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేస్తూ సుప్రీంకోర్టు విస్తృత రాజ్యాంగ ధర్మాసనం తీసుకున్న నిర్ణయాన్ని యావత్ భారతదేశం హర్షం వ్యక్తం చేసిందన్నారు. ఈ విషయాన్ని పక్క దోవ పట్టించడానికే కేంద్ర ప్రభుత్వం సీఏఏ అమలును ప్రకటించిందన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శులు పీ నారాయణస్వామి, సీ మల్లికార్జున, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్, సింగనమల నియోజకవర్గం సభ్యులు పీ నారాయణస్వామి, రాప్తాడు నియోజకవర్గం సభ్యులు పీ రామకృష్ణ, నగర సహాయ కార్యదర్శి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## తమిళనాట కుదిరిన సీట్ల ఒప్పందం

**డీఎంకే 21, కాంగ్రెస్‌కు 9 సీట్లు**

**సీపీఐ, సీపీఎంకు రెండేసీ స్థానాలు**

చెన్నై: తమిళనాడులో డీఎంకే, కాంగ్రెస్, మిత్రపక్షాల మధ్య లోక్‌సభ ఎన్నికల సీట్ల ఒప్పందం కొలిక్కి వచ్చింది. ఈ పార్టీలన్నీ ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్నాయి. మొత్తం 39 స్థానాల్లో కాంగ్రెస్ తొమ్మిది నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. నిన్న ముంబైలో ముఖ్యమంత్రి స్టాలిన్, రాహుల్ గాంధీ, మల్లికార్జునఖర్గే మధ్య జరిగిన భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. విరుదునగర్, శివగంగ, తిరునెల్వేలి, కన్యాకుమారి, మైలాడుతురై, కరూర్, కృష్ణగిరి, తిరువళ్లూరు, కడలూరు సహా 9 సీట్లను పాలక డీఎంకే కాంగ్రెస్‌కు కేటాయించింది. డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివలయంలో సోమవారం డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె.సెల్వపెరుంతగై ఈ మేరకు ఒప్పందంపై సంతకాలు చేశారు. ప్రత్యేకించి కాంగ్రెస్ పార్టీకి కేటాయించిన నియోజకవర్గాల పేర్లను వెల్లడించారు. అనంతరం సెల్వపెరుంతగై విలేకరులతో మాట్లాడుతూ రెండు, మూడు రోజుల్లో పార్టీ అభ్యర్థుల పేర్లు ప్రకటిస్తామని చెప్పారు. పుదుచ్చేరిలోని ఏకైక లోక్‌సభ సీటును కూడా తమ పార్టీకే కేటాయించారన్నారు. తిరుచురాపల్లి లోక్‌సభ స్థానాన్ని వైకో నేతృత్వంలోని ఎండీఎంకేకు ఖరారు చేశారు. ఈ నియోజకవర్గానికి ప్రస్తుతం కాంగ్రెస్ నేత తురునవుక్కరసు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇప్పుడు ఎండీఎంకే తరపున వైకో తనయుడు దురై వైకో పోటీ చేయనున్నారు. ప్రస్తుతం డీఎంకే ప్రాతినిధ్యం వహిస్తున్న కడలూరు, మయలదుతరై, తిరునెల్వేలి సీట్లను కాంగ్రెస్‌కు కేటాయించారు. మిగిలిన సీట్లలో కాంగ్రెస్ ప్రాతినిధ్యం వహిస్తోంది. సీట్ల కేటాయింపును డీఎంకే ఇప్పటికే పూర్తి చేసింది. మదురై, దుండిగల్‌ను సీపీఎంకు, నాగపట్నం, తిరుప్పూర్‌ను సీపీఐకి కేటాయించింది. చిదంబరం, విల్లుపురం స్థానాలను మరో మిత్రపక్షం వీసీకేకు, ఐయూఎంఎల్‌కు రామనాథపురం, నమక్కల్ సీటును కొంగునాడు మక్కల్ దేశీయ కచ్(కేఎండీకే)కు కేటాయించింది. డీఎంకే మొత్తం 21 సీట్లలో పోటీ చేస్తుంది. అయితే నమక్కల్ స్థానంలో కేఎండీకే అభ్యర్థి కూడా డీఎంకే ఎన్నికల గుర్తుపై పోటీ చేస్తుండటంతో డీఎంకే 22 సీట్లలో పోటీ చేస్తున్నట్లు అయింది. మిగిలిన 18 సీట్లను మిత్రపక్షాలకు కేటాయించింది.

## బాలిస్టిక్ మిస్సైళ్లను పరీక్షించిన ఉత్తర కొరియా

పోంగ్యాంగ్: ఉత్తర కొరియా మూడు స్వల్పశ్రేణి బాలిస్టిక్ మిస్సైళ్లను పరీక్షించింది. తూర్పు సముద్రంలోకి వాటిని విడుదల చేసింది. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్... దక్షిణ కొరియాలో పర్యటిస్తున్న సమయంలో ఉత్తర కొరియా ఈ క్షిపణులను పరీక్షించినట్లు సమాచారం. రెండు నెలల తర్వాత తొలిసారి ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షిపణులను పరీక్షించింది. సోమవారం ఉదయం 7.44 నిమిషాల నుంచి 8.22 నిమిషాల మధ్య ఫైరింగ్ జరిగినట్లు దక్షిణ కొరియా జాయింట్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ తెలిపారు. ఆ క్షిపణులు సుమారు 300 కిలోమీటర్ల దూరం ప్రయాణించిన పిదప తూర్పు సముద్రం (సీ ఆఫ్ జపాన్)లో ల్యాండ్ అయ్యాయి. ఉత్తర కొరియా కనీసం మూడు క్షిపణులను ప్రయోగించి ఉంటుందని భావిస్తున్నారు. కేఎన్-24 మిస్సైళ్ల తరహాలో అవి ప్రయాణించినట్లు అంచనా వేస్తున్నారు. కేఎన్-24.. సాలిడ్ ఫ్యూయల్ బాలిస్టిక్ మిస్సైల్. అది సుమారు 410 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలదు. ఆ మిస్సైల్ దాదాపు 500 కేజీల బరువున్న పేలోడ్‌ను మోసుకెళ్లగలదు. కాగా ఉత్తర కొరియా క్షిపణి పరీక్షలు చేయడాన్ని జపాన్ ప్రధాని కిషిద ఖండించారు.

## సత్యేందర్ జైన్‌కు సుప్రీంలో చుక్కెదురు

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో ఆప్ నేత సత్యేందర్ జైన్ సాధారణ బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం కొట్టేసింది. ఇప్పటికే మధ్యంతర బెయిల్‌పై బయట ఉన్న ఆయనను వెంటనే లొంగిపోవాలని న్యాయమూర్తులు బేలా ఎం త్రివేది, పంకజ్ మిథాల్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. లొంగిపోయేందుకు వారం రోజుల గడువు ఇవ్వాలంటూ జైన్ న్యాయవాది చేసిన అభ్యర్థనను అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. వైద్య కారణాలతో 2023 మే 26న జైన్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన అత్యున్నత న్యాయస్థానం దానిని పొడిగిస్తూ వచ్చింది. 2015-16 సమయంలో జైన్ సంస్థలకు హవాలా నెట్‌వర్క్ ద్వారా అనేక షెల్ కంపెనీల నుంచి సుమారు రూ.4.81 కోట్లు ముట్టినట్లు ఈడీ దర్యాప్తులో గుర్తించింది. ఈ క్రమంలో ఆయన కుటుంబానికి చెందిన రూ.4.81 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసింది. 2022 మే 30న ఆయనను అరెస్టు చేసింది.

## సంక్షోభం వేళ నీటి ఆదాకు బెంగళూరు డాక్టర్ సూచనలు

బెంగళూరు: కర్ణాటకలో గత కొన్ని రోజులుగా తీవ్ర నీటి కొరత ఏర్పడింది. ముఖ్యంగా రాజధాని బెంగళూరులో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉండటంతో ప్రజల ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఈ సమస్య నుంచి గట్టెక్కేందుకు నగరానికి చెందిన ఓ డాక్టర్ దివ్య శర్మ సమయస్ఫూర్తితో ఆలోచించారు. రోజువారీ జీవన విధానంలో ఎలాంటి రాజీ పడకుండానే నీటి వినియోగంలో చిన్నచిన్న మార్పులు చేశారు. అవి ఫలించడంతో రోజుకు 600 లీటర్ల నీటిని ఆదా చేసుకోగలిగారు. ఈ విషయాన్ని ఆమె సోషల్ మీడియాలో పంచుకున్నారు. మరి ఆ టిప్స్ ఏంటో ఆమె మాటల్లోనే తెలుసుకుందాం. "నలుగురు సభ్యులుండే మా ఇంట్లో చిన్న మార్పులతో రోజూ కొంత నీటిని ఆదా చేయగలిగాం. ఓవర్‌హెడ్ షవర్లను తీసేశాం. షవర్‌తో నిమిషానికి 13 లీటర్ల నీరు వినియోగిస్తాం. అంటే ఐదు నిమిషాల స్నానానికి 65 లీటర్లు. అదే బకెట్ అయితే 20 లీటర్లతో స్నానం ముగించొచ్చు. ఇలా మేం ఒక్కో వ్యక్తికి 45 లీటర్ల చొప్పున 180 లీటర్లు ఆదా చేశాం. కుళాయిలకు ఏరేటర్స్ (ధారగా కాకుండా చిల్లులా నీరు పడేందుకు వీలుగా) ఏర్పాటుచేశాం. దీనివల్ల ఒక రోజు మొత్తంలో గిన్నెలు శుభ్రం చేయడానికి 90 లీటర్ల నీరు సరిపోయింది. అంతకుముందు దీనికి 450 లీటర్లు ఉపయోగించేవాళ్లం. అంటే దాదాపు 360 లీటర్లు సేవ్ చేయగలిగాం. ప్యూరిఫయర్ నుంచి వచ్చే నీటిని సేకరించి ఇల్లు తుడవడానికి, గార్డెనింగ్‌కు ఉపయోగించాం. దీంతో 30 లీటర్లు ఆదా అయింది. కార్‌వాష్ చేయడం ఆపేశాం. దుమ్ము తుడుచుకుని రోజు మార్చి రోజు తడి గుడ్డతో శుభ్రం చేసుకున్నాం. ఇలా మరో 30 లీటర్లు సేవ్ చేశాం. ఇలా రోజువారీ జీవనానికి ఎలాంటి ఆటంకం లేకుండానే చిన్నచిన్న టిప్స్‌ను పాటించి నీటిని మెరుగ్గా వినియోగించుకోగలిగాం" అని దివ్య సోషల్ మీడియాలో రాసుకొచ్చారు. ఆమె పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. ఈ డాక్టర్ ఐడియాను నెటిజన్లు మెచ్చుకుంటున్నారు.

# పాత్రికేయ వృత్తిలో విశేష కృషి

**శ్రీనివాస్‌రెడ్డి సన్మాన సభలో వక్తలు**

**ప్రజాపక్షం ఎడిటర్‌గా సుబ్బారావు బాధ్యతలు**

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రజాపక్షం తెలుగు దినపత్రిక సంపాదకులుగా బాధ్యతల నుంచి వైదొలగిన కె.శ్రీనివాస్‌రెడ్డికి నవచేతన విజ్ఞాన సమితి భవన్‌లో సోమవారం వీడ్కోలు సభ జరిగింది. ఆయన స్థానంలో సంపాదకులుగా సీనియర్ జర్నలిస్టు మక్కెన సుబ్బారావు బాధ్యతలు స్వీకరించారు. సమితి అధ్యక్షుడు పల్లా వెంకటరెడ్డి అధ్యక్షతన ఈ సభ జరిగింది. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా నియమితులైన శ్రీనివాస్‌రెడ్డిని పల్లా వెంకటరెడ్డితో పాటు నవచేతన విజ్ఞాన సమితి కార్యదర్శి బి.ఎస్.ఆర్. మోహనరెడ్డి, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్‌రావు తదితరులు శాలువా పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అలాగే మక్కెన సుబ్బారావును కూడా శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించి ఆహ్వానం పలికారు. సంపాదకుడుగా పత్రిక ఆవిర్భావం నుంచి శ్రీనివాస్‌రెడ్డి చేసిన అవిశ్రాంత సేవలను ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. అటు ప్రజాపక్షం పత్రిక అభివృద్ధికి, ఇటు పాత్రికేయ వృత్తి విలువలతోపాటు, జర్నలిస్టుల సంక్షేమాభివృద్ధికి శ్రీనివాస్‌రెడ్డి సవ్యసాచిలా కృషి చేశారని ప్రశంసించారు. ఆయన సారథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో పత్రికా విలువలు సమున్నతంగా వర్ధిల్లగలవని ఆకాంక్షించారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పత్రికా రంగంలో ప్రజాపక్షం దినపత్రిక విభిన్నమైనదని, లక్ష్యసాధనలో పత్రిక మరింత అభివృద్ధి పథంలో సాగేందుకు సిబ్బంది చిత్తశుద్ధితో సేవలు అందించాలన్నారు. మక్కెన సుబ్బారావు మాట్లాడుతూ వామపక్ష జర్నలిజంలో ఐదు దశాబ్దాల ప్రస్థానంలో శ్రీనివాస్‌రెడ్డి సహా అనేక మందితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పత్రికా సిబ్బంది భాషపై పట్టు సాధించాలని, నాది అనే భావనతో సిబ్బంది పత్రిక అభ్యున్నతికి అంకితభావంతో పని చేయాలని కోరారు. నవచేతన విజ్ఞాన సమితి గవర్నరింగ్ బాడీ సభ్యులు, ఐఎల్‌ఓ నాయకుడు బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ శ్రీనివాస్‌రెడ్డి, మక్కెన సుబ్బారావుకు అభినందనలు తెలిపారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ సభ్యులు పల్లె నరసింహ తన గాన మాధుర్యంతో అందరినీ అలరించారు. ప్రజాపక్షం దినపత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా బి.కిరణ్ కుమార్, అసిస్టెంట్ ఎడిటర్‌గా బి.లక్ష్మీనారాయణ, న్యూస్ ఎడిటర్‌గా పి.శ్రీనివాసరెడ్డి, పత్రిక చీఫ్ రిపోర్టర్‌గా చంద్రశేఖర్ నియమితులైనట్లు ఈ సందర్భంగా పల్లా వెంకట రెడ్డి ప్రకటించారు. వీరంతా సభలో పాల్గొన్నారు. పత్రిక ప్రకటనల విభాగాధిపతి మదన్‌తో పాటు 33 జిల్లాల రిపోర్టర్లు, మాజీ ఉద్యోగి రమణ, సిబ్బంది ఈ సభలో పాల్గొన్నారు. కాగా, పత్రిక నూతన సంపాదకులుగా బాధ్యతలు స్వీకరించిన మక్కెన సుబ్బారావు ప్రకాశం జిల్లా వాసి. 1966 అక్టోబరులో విశాలాంధ్ర దినపత్రికలో ట్రయినీ సబ్ ఎడిటర్‌గా చేరారు. 70వ దశకంలో ఐదేళ్లపాటు హైదరాబాద్‌లో విశాలాంధ్ర ముఖ్య విలేకరిగా పని చేశారు. ఆ తదుపరి న్యూస్ ఎడిటర్‌గా 20 సంవత్సరాలు, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్, లీడర్ రైటర్‌గా, అసోసియేట్ ఎడిటర్‌గా మొత్తం 50 సంవత్సరాలు విశాలాంధ్ర' ప్రస్థానంలో ఆయన పాత్రికేయ జీవితం మమేకమైంది. మన తెలంగాణా, ప్రజాపక్షం పత్రికల్లో అసోసియేట్ ఎడిటర్‌గా 2023 వరకూ ఆరు సంవత్సరాల పాటు ఆయన పని చేశారు.

## ఎన్నికల్లో పోటీచేసే ధైర్యం లేదా... రాహుల్‌పై మాజీ సీఎం ఫైర్

భూపాల్: మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై మండిపడ్డారు. రాహుల్ గాంధీది భారత్ జోడో న్యాయ్ యాత్ర... కాంగ్రెస్ తోడో, కాంగ్రెస్ చోడో యాత్రగా మారిందని విమర్శించారు. గత అనుభవాలు చూస్తే రాహుల్ గాంధీ యాత్రలు చేసిన ప్రతిచోట కాంగ్రెస్ ఓడిపోతుందన్నారు. రాహుల్ నిన్న ముంబైలో మరో విఫల యాత్రను ముగించారని ఎద్దేవా చేశారు. ఆయన రెండు యాత్రలు చేశారని... ఆ రెండూ కాంగ్రెస్ తోడో, కాంగ్రెస్ చోడో యాత్రలుగా మారాయన్నారు. రాహుల్ గాంధీ ఉద్దేశపూర్వకంగానే కాంగ్రెస్‌కు అన్యాయం చేస్తున్నారన్నారు. యాత్ర చేసినప్పుడల్లా కాంగ్రెస్ ఓటమిని ఎదుర్కొంటుందని, సీనియర్ నేతలు ఆ పార్టీని వీడారని శివరాజ్ సింగ్ చౌహాన్ గుర్తు చేశారు.

నాలుగు ప్రశ్నలు.. : దేశ ప్రజల తరపున రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీకి తాను నాలుగు ప్రశ్నలు వేస్తున్నానని సమాధానం చెప్పగలరా అని శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రశ్నించారు. అయోధ్యలో శ్రీరాముని ప్రాణప్రతిష్ఠ వేడుకకు హాజరయ్యేందుకు వచ్చిన ఆహ్వానాన్ని ఎందుకు తిరస్కరించారో రాహుల్‌తో పాటు మల్లికార్జున్ ఖర్గే చెప్పగలరా అని అడిగారు. కాంగ్రెస్ పార్టీ నిర్ణయాన్ని దేశ ప్రజలు తెలుసుకోవాలనుకుంటున్నారన్నారు. పశ్చిమ బెంగాల్‌లో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు సంబంధించి కాంగ్రెస్ మహిళలకు మద్దతుగా ఎందుకు మాట్లాడలేదన్నారు. రాహుల్‌గాంధీతో పాటు కాంగ్రెస్ నేతలు ప్రధాని మోదీపై అభ్యంతరకర ప్రకటనలు చేస్తున్నారని... ప్రధాని పదవిలో ఉన్న వ్యక్తిపై అభ్యంతరకర ప్రకటనలు చేయడం భారత సంస్కృతిలో లేదన్నారు. అది కాంగ్రెస్, ఇండియా కూటమి సంస్కృతిలో భాగమా అని ప్రశ్నించారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో సోనియాగాంధీ ఎందుకు పోటీ చేయడం లేదని.. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీచేసే ధైర్యం ఎందుకు చూపించలేదో కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలని శివరాజ్ సింగ్ డిమాండ్ చేశారు.

## అమెరికాలో తెలుగు విద్యార్థి దారుణ హత్య?

వాషింగ్టన్: అమెరికాలో మరో తెలుగు విద్యార్థి దారుణ హత్యకు గురయ్యాడు. 20 ఏళ్ల విద్యార్థి మృతదేహాన్ని అధికారులు అటవీ ప్రాంతంలో గుర్తించారు. మీడియా కథనాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా బుర్రిపాలేనికి చెందిన 20 ఏళ్ల పరుచూరి అభిజిత్ ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. అక్కడ బోస్టన్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. అయితే అతడు క్యాంపస్ సమీపంలోని అటవీ ప్రాంతంలో శవమై కనిపించాడు. వర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థి శవమై కనిపించడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డబ్బు, ల్యాప్‌టాప్ కోసమే అభిజిత్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసినట్లు అనుమానిస్తున్నారు. కాగా, బుర్రిపాలేనికి చెందిన పరుచూరి చక్రధర్, శ్రీలక్ష్మి దంపతులకు అభిజిత్ ఒక్కగానొక్క కుమారుడు. అభిజిత్ చిన్నతనం నుంచి చదువులో ముందుండేవాడు. విదేశాల్లో చదువుకోవాలనే అతడి నిర్ణయాన్ని మొదట్లో తల్లి శ్రీలక్ష్మి వ్యతిరేకించినప్పటికీ.. కొడుకు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తన నిర్ణయం మార్చుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో ఉన్నత చదువుల కోసం అమెరికా పంపినట్లు చెప్పారు. తాజాగా ఒక్కగానొక్క కొడుకు హత్యకు గురయ్యాడని తెలియగానే పరుచూరి అభిజిత్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కాగా, ఇటీవల కొంతకాలంగా అమెరికాలో తెలుగు విద్యార్థుల వరుస మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఉన్నత చదువుల కోసం అగ్రరాజ్యం వెళ్లిన విద్యార్థులు ఒకరి తర్వాత ఒకరు అనుమానాస్పద స్థితిలో శవమై కనిపిస్తున్న దృశ్యాలు ఇటీవలే అనేకం వెలుగు చూశాయి. అమెరికాలో భారత సంతతికి చెందిన విద్యార్థి మరణించడం ఈ ఏడాది (2024)లో ఇది తొమ్మిదో ఘటన కావడం గమనార్హం.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.